# తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం | జాతీయ పత్రిక

యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 14 | మంగళవారం | 11-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/-

Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:14 | Tuesday | 11-8-2026 | Pages:08 | Cost:2/-



విలేకరులు కావలెను

జాతీయ దిన పత్రిక తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## కొలంబియాను కుదిపేసిన భారీ భూకంపం..

# 69 మంది మృతి

- పశ్చిమ కొలంబియాలో 7.4 తీవ్రతతో భారీ భూకంపం
- ప్రకృతి విలయానికి 69 మందికి పైగా మృతి
- వేలాది భవనాలు నేలమట్టం, ఆరు విమానాశ్రయాలు మూసివేత
- బాధితులను ఆదుకుంటామని కొలంబియా అధ్యక్షుడి హామీ



# ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు

- పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభలో కేటీఆర్
- దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డికి కేటీఆర్ నివాళి
- పెద్ది కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ
- ప్రజల హృదయాల్లో పెద్ది చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడిన కేటీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో సోమవారం నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు.

## ఇరాన్‌పై కఠినంగా ట్రంప్..

# భారీ సైనిక చర్యకు సంకేతాలు

- ఇరాన్‌పై భారీ సైనిక చర్యకు అవకాశం ఉందన్న ట్రంప్
- హర్మూజ్ జలసంధి పూర్తిగా తమ నేవీ నియంత్రణలో ఉందని వెల్లడి
- నష్టపరిహారం అడిగిన ఇరాన్‌కు ఎదురు డిమాండ్ పెట్టిన అధ్యక్షుడు
- గత 50 ఏళ్లలో జరిగిన నష్టానికి ఇరానే పరిహారం చెల్లించాలని వ్యాఖ్య


2లో

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం నిర్వహించిన మహా వరుణయాగం వేదపండితుల మంత్రోచ్ఛారణలు, వైదిక క్రతువుల మధ్య శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో సంపూర్ణమైంది. నాగార్జునసాగర్‌లోని విజయవిహార్ అతిథి గృహం వద్ద కృష్ణా నది ఒడ్డున నిర్వహించిన ఈ యాగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు పాల్గొని రుత్వికుల మార్గదర్శకత్వంలో క్రతువులు నిర్వహించారు. కృష్ణమ్మకు సీఎం పూర్ణాహుతి సమర్పించారు.



# వర్షాల కోసం వరుణ యాగం..

- సతీసమేతంగా పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి
- తెలంగాణలో వర్షాల కోసం ప్రభుత్వం మహా వరుణ యాగం
- నాగార్జున సాగర్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతుల పూజలు
- ఎల్ నినో ప్రభావం, తగ్గిన జలమట్టాల నేపథ్యంలో ప్రత్యేక క్రతువు
- యాదగిరిగుట్ట పండితుల ఆధ్వర్యంలో 11 హోమగుండాలతో యాగం

నల్లగొండ: 'రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలి. కృష్ణా, గోదావరి నదులు నిండుగా ప్రవహించాలి. ప్రాజెక్టులు, చెరువులు నిండాలి..'అని ప్రార్థించారు. సోమవారం ఉదయం 4 గంటలకు బ్రహ్మ ముహూర్తంలో యాగాన్ని ప్రారంభించారు.

- మిగతా 2వ పేజీలో

# నా రాజకీయ జీవితంలో ఇంత దౌర్భాగ్యపు పార్టీని చూడలేదు

- కైకలూరులో భూ హక్కు పత్రాలు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు
- భూ కబ్జాదారుల పెత్తనానికి చరమగీతం పాడతామని హామీ
- వైసీపీ ఒక గొడ్డలి పార్టీ అని, రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తోందని తీవ్ర విమర్శ
- గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను ఉపేక్షించేది లేదని, పోలీసులపై దాడులు సహించబోమని హెచ్చరిక
- ఆక్వా రైతులకు రూ.1.50కే విద్యుత్ అందిస్తామని, 10 ఎకరాల నిబంధన రద్దు చేశామని ప్రకటన

రాష్ట్రంలో గొడ్డలి పార్టీ అరాచకాలకు, గంజాయి బ్యాచ్‌ల ఆగడాలకు శాశ్వతంగా చరమగీతం పాడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. దశాబ్దాలుగా నలుగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో తాము పనిచేస్తుంటే, ప్రతిపక్ష వైసీపీ మాత్రం శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తోందని ఆయన మండిపడ్డారు. సోమవారం ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలోని కలిదిండిలో నిర్వహించిన భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రతిపక్షంపై నిప్పులు చెరిగారు.

**భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం**

ప్రతి నెల 9వ తేదీన భూ సమస్యల పరిష్కారంపై సమీక్ష నిర్వహించి, నేరుగా ప్రజల వద్దకే వచ్చి పట్టాలు అందిస్తున్నామని చంద్రబాబు తెలిపారు.



- మిగతా 2వ పేజీలో

## పన్నుల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం..

- యూపీఐ ఛార్జీలపై నిర్మలా సీతారామన్ కీలక ప్రకటన
- పన్నుల సవరణ బిల్లు 2026కు పార్లమెంట్ ఆమోదం
- యూపీఐ లావాదేవీలపై వినియోగదారులకు ఛార్జీలు లేవని నిర్మలా సీతారామన్ స్పష్టీకరణ
- మర్చంట్ డిస్కౌంట్ రేట్‌పై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదన్న కేంద్రం




## ఆగస్టు 17 నుంచి ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు...

- ఈసారి కూడా వైసీపీ గైర్హాజరు?
- ఆగస్ట్ 17 నుంచి ఏపీ శాసనసభ వర్షాకాల సమావేశాలు
- ప్రతిపక్ష హోదా ఇవ్వనందున అసెంబ్లీకి దూరంగా ఉండనున్న వైసీపీ
- శాసనమండలి సమావేశాలకు మాత్రం హాజరుకానున్న విపక్షం



# ఝార్ఖండ్‌లో టెన్షన్..

- ఝార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తం
- బారికేడ్లు దాటి అసెంబ్లీ వైపు విద్యార్థుల మార్చ్
- అడ్డుకునేందుకు వాటర్ కేనన్లు ప్రయోగించిన పోలీసులు
- పేపర్ లీక్‌లపై సీబీఐ దర్యాప్తు కోరుతున్న విద్యార్థులు
- 13 పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్

రాంచి, ఆగస్టు 10: జార్ఖండ్ అసెంబ్లీ ప్రాంగణం వైపు దూసుకెళ్లిన నిరసనకారులపై పోలీసులు లాఠీలు ఝులిపించారు. వాటర్ కెనన్లు, బాష్పవాయువును ప్రయోగించారు. పోలీసు లాఠీచార్జీలో పలువురు విద్యార్థుల తలలు పగిలి తీవ్రంగా గాయపడ్డారు. బారికేడ్లను ఛేదించుకుని అసెంబ్లీ వద్దకు చేరుకోవడానికి భారీ సంఖ్యలో విద్యార్థులు తరలిరావడంతో పరిస్థితి

- మిగతా 2వ పేజీలో

# సురక్షితంగా తీసుకొస్తాం..

- ఉద్యోగాల పేరుతో థాయ్‌లాండ్‌కు వెళ్లి మోసపోయిన తెలుగు యువత
- సైబర్ నేరగాళ్ల చెర నుంచి తప్పించుకుని సరిహద్దుల్లో చిక్కుకున్న బాధితులు
- తమను రక్షించాలంటూ సోషల్ మీడియా ద్వారా అభ్యర్థన
- స్పందించిన మంత్రి నారా లోకేశ్, సురక్షితంగా రప్పిస్తామని హామీ
- విదేశాంగ శాఖ అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు వెల్లడి



## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో రగడ

### మంత్రి పొంగులేటి వర్సెస్ పాడి కౌశిక్ రెడ్డి

- హన్మకొండ జిల్లా కమలాపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో ఉద్రిక్తత
- మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్‌తో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వాగ్వాదం
- గత ప్రభుత్వంపై విమర్శలు చేయడంతో వేదికపైనే అభ్యంతరం తెలిపిన ఎమ్మెల్యే
- ప్రభుత్వ వేదికపై రాజకీయాలు వద్దంటూ మంత్రులకు హితవు
- ఇరువర్గాల నినాదాలతో జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దిన పోలీసులు



# ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా నర్సంపేటలో నిర్మించనున్న మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టనున్నట్లు కేటీఆర్ కీలక ప్రకటన చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని అగ్రభాగాన నిలిచి నడిపించిన గొప్ప నాయకుడు పెద్ది అని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "ఎంతకాలం జీవించామన్నది ముఖ్యం కాదు, ఎలా జీవించామన్నదే ప్రధానం. పెద్ది సుదర్శన్ రెడ్డి ఒక్క పర్యాయం ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసేలా పనిచేశారు" అని వ్యాఖ్యానించారు. ఆయన అంత్యక్రియలకు పోటెత్తిన అశేష జనవాహిని, ప్రజల్లో ఆయనకు ఉన్న గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు. సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకునే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ భరోసా ఇచ్చారు. పార్టీ ఆవిర్భావం నుంచి కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న సుదర్శన్ రెడ్డి, జులై 31న గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన గతంలో జడ్పీటీసీ సభ్యుడిగా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా సేవలందించడంతో పాటు, 2018-2023 మధ్య కాలంలో నర్సంపేట ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహించారు. కాగా, నిన్న ఆదివారం నాడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పెద్ది సుదర్శన్ రెడ్డి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ క్రమంలో పార్టీ తరఫున ప్రకటించిన రూ. 2.25 కోట్ల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇందులో సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లల పేరున ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున, ఆయన తల్లి సంక్షేమం కోసం రూ. 25 లక్షలను కేటాయించారు.

# ఇరాన్‌పై కఠినంగా ట్రంప్.. భారీ సైనిక చర్యకు సంకేతాలు

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్‌పై భారీ సైనిక చర్య చేపట్టే అవకాశాన్ని తోసిపుచ్చలేమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. నష్టపరిహారం చెల్లించాలన్న టెహ్రాన్ డిమాండ్‌ను తిరస్కరించడమే కాకుండా, కీలకమైన హర్మూజ్ జలసంధి పూర్తిగా తమ నేవీ నియంత్రణలోనే ఉందని తేల్చిచెప్పారు. మంగళవారం వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడిన ట్రంప్, ఇరాన్‌తో చర్చల తర్వాత తదుపరి చర్య ఏంటని ప్రశ్నించగా.. "మీకే తెలుస్తుంది" అని రెండుసార్లు సమాధానమిచ్చారు. భారీ సైనిక చర్యకు అవకాశం ఉందా? అని అడగ్గా, "మాకు ఆ సామర్థ్యం ఉంది. మేం చేయాలనుకుంటే చేస్తాం" అని బదులిచ్చారు. అమెరికా వల్ల జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని ఇరాన్ డిమాండ్ చేసిందని, అయితే గత 50 ఏళ్లుగా ఇరాన్ చర్యల వల్ల బాధితులైన వారికి టెహ్రానే పరిహారం చెల్లించాలని తాను వాదించినట్లు ట్రంప్ వివరించారు. "నష్టపరిహారం చెల్లించాల్సి వస్తే, ఆ నష్టాన్ని ఇరానే చెల్లించాలి" అని ఆయన అన్నారు. ప్రస్తుతం హర్మూజ్ జలసంధి తమ పూర్తి నియంత్రణలో ఉందని ట్రంప్ పేర్కొన్నారు. "ఇదొక ఉక్కు గోడ లాంటిది. మేం అనుమతించిన వారిని మాత్రమే లోపలికి రానిస్తాం. ఇరాన్‌కు వెళ్లే నౌకలను మాత్రం అనుమతించడం లేదు" అని ఆయన తెలిపారు. ఇరాన్ ఆర్థికంగా పూర్తిగా దివాలా తీసిందని, పశ్చిమాసియాలో ఒక 'బుల్లీ'గా వ్యవహరించిందని ట్రంప్ ఆరోపించారు.

# ఝార్ఖండ్‌లో టెన్షన్..

అదుపుతప్పింది. నిరసనకారులను అదుపు చేసేందుకు పోలీసులు బాష్పవాయువును, జల ఫిరంగులను ప్రయగించారు. త్రివర్ణ పతాకాలు, ప్లకార్డులు చేతబూనిన నిరసనకారులు వాటర్ కెనన్లను పోలీసులు ప్రయోగించిన సమయంలో నృత్యం చేయడం ప్రారంభించారు. కొత్త అసెంబ్లీ భవనానికి దారితీసే జగన్నాథ్‌పూర్ ఆలయ రోడ్డు సమీపానికి చేరుకున్న తమపై పోలీసులు జరిపిన చర్యలో పలువురు గాయపడినట్లు నిరసనకారులు తెలిపారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(జేపీఎస్సీ), జార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(జేఎస్ఎస్సీ) నిర్వహించిన నియామక పరీక్షల్లోని అవకతవకల ఆరోపణలకు వ్యతిరేకంగా సాగుతున్న విద్యార్థుల ఉద్యమంలో 17వ రోజున జరిగిన ఈ నిరసన కార్యక్రమం ఆందోళన తీవ్రతను గణనీయంగా పెంచింది. జేఎస్ఎస్సీ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్(సీజీఎల్) పరీక్షను రద్దు చేయాలని, అలాగే నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సీబీఐతో దర్యాప్తు జరపాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. పోలీసు లాఠీచార్జిలో తల పగిలి, తీవ్రంగా గాయపడిన ఇషాంత్ సింగ్ అనే విద్యార్థి తనతో పాటు మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. విద్యార్థులపై పోలీసుల లాఠీ దెబ్బ పడదని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ గతంలో చెప్పారని, ఇప్పుడు జరిగింది ఏమిటని ఆ విద్యార్థి ప్రశ్నించారు. పాత అసెంబ్లీ భవనం నుంచి ఉదయం 10 గంటలకు విద్యార్థులు ర్యాలీగా కొత్త అసెంబ్లీ భవనానికి బయల్దేరారు. సుమారు 3 కిలోమీటర్లు నడిచిన తర్వాత వారిని భద్రతా దళాలు అడ్డుకున్నాయి. అసెంబ్లీకి 1.5 కిలోమీటర్ల దూరంలో బహుళ అంచెల బారికేడ్లను పోలీసులు ఏర్పాటు చేశారు. భారీ సంఖ్యలో మోహరించిన పోలీసులు, భద్రతా సిబ్బంది బాష్పవాయువుతో సిద్ధంగా ఉన్నారు. విద్యార్థులను అడ్డుకునేందుకు వాటర్ కెనన్లను ప్రయోగించగా నిరసనకారులు రెయిన్‌డ్యాన్స్ చేసి తాము వెనక్కు తగ్గేది లేదని స్పష్టం చేశారు. అనంతరం భద్రతా దళాలు బాష్పవాయువు గోళాలను ప్రయోగించి విద్యార్థులను చెదరగొట్టేందుకు ప్రయత్నించాయి. వేలాదిమంది విద్యార్థులు బారికేడ్లను ఛేదించుకుని అసెంబ్లీని చేరుకోవడానికి ప్రయత్నించడంతో పోలీసులు లాఠీచార్జ్ చేశారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో రగడ

హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలంలో సోమవారం నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. మంత్రుల ప్రసంగాలపై స్థానిక హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరుపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవంతో పాటు, లబ్ధిదారులకు పట్టాల పంపిణీ నిమిత్తం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వం పనులను అసంపూర్తిగా వదిలేసిందని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇళ్లను అందిస్తోందని వారు పేర్కొన్నారు. మంత్రుల వ్యాఖ్యలపై అదే వేదికపై ఉన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తక్షణమే స్పందించారు.

# నా రాజకీయ జీవితంలో ఇంత దౌర్భాగ్యపు పార్టీని చూడలేదు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటివరకు 7,450 గ్రామాల్లో 32 లక్షల మందికి పైగా రైతులకు అత్యాధునిక భద్రతా ఫీచర్లతో, బ్లాక్‌చైన్ టెక్నాలజీతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలు అందించామని వెల్లడించారు. గత ప్రభుత్వం తమకు ఇష్టం లేని వారి భూములను 22-ఏ జాబితాలో చేర్చి, వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 41 వేల ఎకరాలను 22-ఏ నుంచి విముక్తి చేసి 25 వేల మంది రైతులకు న్యాయం చేసిందని తెలిపారు. కైకలూరులోనే సుమారు 2,838 ఎకరాలను 1,848 మంది రైతులకు అప్పగించామని చెప్పారు. "మీ భూమిపై మీకే హక్కు ఉండాలి. వేరేవాళ్ల పెత్తనం గానీ, వారి ఫొటోలు గానీ ఉండటానికి వీల్లేదు. ఈ సమస్యను పరిష్కరించే వరకు నేను నిద్రపోను," అని చంద్రబాబు స్పష్టం చేశారు.



### గొడ్డలి పార్టీపై నిప్పులు

గతంలో తాను నక్సలిజం, ఫ్యాక్షనిజం, మత ఘర్షణలను ఉక్కుపాదంతో అణచివేశానని గుర్తుచేసిన చంద్రబాబు, ఇప్పుడు రాష్ట్రానికి "గొడ్డలి పార్టీ" రూపంలో కొత్త ముప్పు వచ్చిందని అన్నారు. "నా 48 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి దౌర్భాగ్యపు పార్టీని చూడలేదు. బాబాయ్‌ను గొడ్డలితో నరికి చంపి, ఆ నెపాన్ని నాపై వేయాలని చూశారు. 'నారాసుర రక్త చరిత్ర' అంటూ నాపైనే కథనాలు రాయించారు. నేను రౌడీలకు సింహస్వప్నం కానీ, నేను రౌడీయిజం చేయను. హత్య చేసినవాడు కూడా అదే విధంగా పోతాడనేది నా సిద్ధాంతం" అని ఉద్వేగంగా ప్రసంగించారు.

గత ఐదేళ్లలో గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్‌లు పెట్రేగిపోయాయని, ఇప్పుడు కూడా పోలీసులపై దాడులు చేస్తూ, రోడ్లపై విన్యాసాలు చేస్తూ శాంతిభద్రతలకు సవాల్ విసురుతున్నారని మండిపడ్డారు. శ్రీకాకుళంలో బందోబస్తుకు వెళ్లిన ఒక మహిళా పోలీస్ అధికారిణిపై వైసీపీ శ్రేణులు దాడి చేసి, అసభ్యంగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఖండించారు. "ప్రజలను కాపాడే పోలీసులకే రక్షణ లేకపోతే, రాష్ట్రంలోని ఆడబిడ్డల పరిస్థితి ఏంటి? ఇలాంటి అరాచకాలను చూస్తూ ఊరుకోవాలా?" అని ప్రశ్నించారు. మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన వారిని అభినందించాల్సింది పోయి, నీట్ కుంభకోణంతో ముడిపెట్టి ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారని, దీనికి నిరసనగా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులే రోడ్లపైకి వచ్చి వైసీపీకి బుద్ధి చెప్పడం శుభపరిణామమని అన్నారు.

### అభివృద్ధి, సంక్షేమమే మా అజెండా

ఎన్డీయే ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్‌గా సూపర్ స్పీడ్‌తో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని చంద్రబాబు తెలిపారు. ఆక్వా రైతులకు ఇచ్చిన మాట ప్రకారం, జోన్, నాన్-జోన్, 10 ఎకరాల పరిమితి అనే తేడా లేకుండా అందరికీ యూనిట్ కరెంటును రూ.1.50కే అందిస్తామని, దీనికోసం రూ.1150 కోట్లు ఖర్చయినా వెనుకాడబోమని ప్రకటించారు. కైకలూరు నియోజకవర్గ తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.36 కోట్లు మంజూరు చేశామని, వీలైనంత త్వరగా సిమెంట్ రోడ్లు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు.

### అధికారులకు జవాబుదారీతనం

సభా వేదికపైనే వివిధ శాఖల అధికారుల పనితీరును ఐవీఆర్ఎస్ డేటా ఆధారంగా సమీక్షించడం ద్వారా పాలనలో పారదర్శకతకు, జవాబుదారీతనానికి పెద్దపీట వేస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. బాగా పనిచేసిన వారిని అభినందించి, వెనుకబడిన వారిని హెచ్చరించారు. "నేను కష్టపడుతున్నాను, మీరు కూడా కష్టపడాలి. ప్రజలకు సేవ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు" అని అధికారులకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. చివరగా, "ఆగస్టు 15న 80వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ పేరుతో '...అనే నేను' అంటూ దేశాభివృద్ధికి, రాష్ట్రాభివృద్ధికి పునరంకితమవుతామని సంకల్పం తీసుకోవాలి" అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సురక్షితంగా తీసుకొస్తాం..



ఉద్యోగాల ఆశతో థాయ్‌లాండ్‌కు వెళ్లి, సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కి మోసపోయిన తెలుగు యువతకు ఏపీ ప్రభుత్వం అండగా నిలిచింది. మయన్మార్-థాయ్‌లాండ్ సరిహద్దుల్లో నిస్సహాయ స్థితిలో చిక్కుకుపోయిన వారిని సురక్షితంగా స్వదేశానికి రప్పిస్తామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేసి, కేంద్ర విదేశాంగ శాఖతో సమన్వయం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు, హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఒకరితో సహా మొత్తం ఆరుగురు యువకులు మంచి ఉద్యోగాల కోసం ఓ ఏజెంట్‌ను నమ్మి థాయ్‌లాండ్‌కు వెళ్లారు. అయితే, అక్కడకు చేరాక వారు మోసపోయారని గ్రహించారు. సైబర్ నేరాలకు పాల్పడే ఓ ముఠా వీరిని నిర్బంధించి, తీవ్రమైన ఒత్తిడి, వేధింపులకు గురిచేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాల్లోకి బలవంతంగా దించింది. ఈ నరకం నుంచి బయటపడేందుకు బాధితులు ఎలాగోలా కొంత డబ్బు చెల్లించి, వారి చెర నుంచి తప్పించుకున్నారు. ప్రస్తుతం వారు థాయ్‌లాండ్ వైపు ఉన్న మయన్మార్ సరిహద్దు ప్రాంతానికి చేరుకుని అక్కడే చిక్కుకుపోయారు. తమను ఎక్కడికైనా తరలించే ప్రమాదం ఉందని భయపడుతూ, తమను రక్షించాలంటూ సోషల్ మీడియా ద్వారా వేడుకున్నారు. ఈ వీడియోలు, పోస్టులు వైరల్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయం తన దృష్టికి రావడంతో మంత్రి నారా లోకేశ్ వెంటనే స్పందించారు. బాధితుల ఆందోళన, వేదనను తాను అర్థం చేసుకోగలనని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. "థాయ్‌లాండ్‌లో చిక్కుకున్న యువత పరిస్థితి గురించి తెలిసింది. వారి కుటుంబ సభ్యుల ఆందోళనను అర్థం చేసుకోగలను. బాధితులను సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం" అని లోకేశ్ హామీ ఇచ్చారు. తక్షణమే అధికారులతో మాట్లాడి, కేంద్ర విదేశాంగ శాఖ, సంబంధిత రాయబార కార్యాలయ అధికారులతో సమన్వయం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. బాధితుల కుటుంబ సభ్యులు తన కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ చర్యలతో బాధితులు త్వరలోనే సురక్షితంగా స్వదేశానికి తిరిగి వస్తారని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# ఆగస్టు 17 నుంచి ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు...

ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు ఆగస్ట్ 17 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే, ప్రతిపక్ష హోదా వివాదం నేపథ్యంలో ఈ సమావేశాలకు దూరంగా ఉండాలని వైసీపీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. నోటిఫికేషన్ ప్రకారం, ఆగస్ట్ 17న ఉదయం 9 గంటలకు శాసనసభ, ఉదయం 10 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. 2024 ఎన్నికల్లో కేవలం 11 స్థానాలకే పరిమితమైన వైసీపీకి ప్రతిపక్ష నేత (ఎల్ఓపీ) హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ కు ఎల్ఓపీ హోదా కల్పించనంత వరకు అసెంబ్లీకి హాజరయ్యే ప్రసక్తే లేదని ఆ పార్టీ ఇప్పటికే స్పష్టం చేసింది. ప్రజల గొంతుకను బలంగా వినిపించాలంటే ప్రతిపక్ష హోదా తప్పనిసరి అని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించకపోవడం వారి అవివేకమే అవుతుందని జగన్ గతంలో వ్యాఖ్యానించారు. ఈ హోదాకు సంబంధించిన అంశం ప్రస్తుతం హైకోర్టులో విచారణ దశలో ఉంది. అయితే, అసెంబ్లీకి దూరంగా ఉన్నప్పటికీ శాసనమండలి సమావేశాలకు మాత్రం హాజరు కావాలని వైసీపీ నిర్ణయించింది.

# పన్నుల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం..

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై వినియోగదారులకు ఎటువంటి ఛార్జీలు లేదా పన్నులు విధించే ఉద్దేశం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం పార్లమెంటులో స్పష్టం చేశారు. పన్నుల, ఇతర చట్టాల (సవరణ) బిల్లు 2026కు పార్లమెంట్ ఆమోదం తెలిపిన సందర్భంగా ఆమె ఈ కీలక ప్రకటన చేశారు. గత వారం లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లును, సోమవారం రాజ్యసభ సైతం మూజువాణి ఓటు ద్వారా ఆమోదించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టంలోని సెక్షన్ 10ఏకు చేసిన సవరణ కేవలం వెసులుబాటు కల్పించే నిబంధన మాత్రమేనని వివరించారు. ఈ సవరణ ద్వారా యూపీఐ వినియోగదారులపై ఎటువంటి లావాదేవీ ఛార్జీలు లేదా పన్నులు విధించడం లేదని ఆమె సభకు విస్పష్టంగా తెలిపారు. మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధింపుపై వెలువడుతున్న ఊహాగానాలపై కూడా ఆమె స్పష్టతనిచ్చారు. పార్లమెంట్ ఆమోదం అనంతరం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) స్టీరింగ్ కమిటీ దీనిపై తుది నిర్ణయం తీసుకుంటుందని, ప్రస్తుతం ఎటువంటి ఎండీఆర్ ఫ్రేమ్‌వర్క్‌ను ఖరారు చేయలేదని వెల్లడించారు.

# వర్షాల కోసం వరుణ యాగం..

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభ క్రతువులో నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పాల్గొన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులతో 11 హోమ గుండాలతో వరుణ దేవుని అనుగ్రహాన్ని ఆకాంక్షిస్తూ వైదిక విధానంలో హోమ క్రతువులు నిర్వహించారు. మధ్యాహ్నం 3.15 గంటలకు యాగశాలలోకి వచ్చిన సీఎం దంపతులు..3:24 గంటలకు పూర్ణాహుతి సమర్పించారు. 'కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు సమృద్ధిగా పడాలి. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులతో పాటు అన్ని ప్రాజెక్టులు నిండాలి. రాష్ట్రంలోని ప్రతి చెరువు, ప్రతి కుంట జలకళను సంతరించుకోవాలి. భూగర్భ జలాలు పెరగాలి. పంటలు పుష్కలంగా పండాలి. రైతుల ముఖాల్లో చిరునవ్వులు కనిపించాలి. రాష్ట్రం సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉండాలి. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలి..'అని ముఖ్యమంత్రి వరుణ దేవుడిని ప్రార్థించారు. భారతీయ సంస్కృతిలో వర్షాలు కురవాలని యాగాలు, యజ్ఞాలు, పూజలు నిర్వహించడం పూర్వీకుల నుంచి వస్తున్న ఆధ్యాత్మిక సంప్రదాయం. కాగా వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో ఈసారి వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ఈ మహా వరుణయాగాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, పి.సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి కె.జానారెడ్డి, ఎమ్మెల్యేలు కుందూరు జయవీర్‌రెడ్డి, నేనావత్ బాలునాయక్, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేలు, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. సూర్యకిరణాలు ఇంకా కృష్ణమ్మ జలాలను తాకకముందే.. నాగార్జునసాగర్ పరిసరాల్లో నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ సోమవారం తెల్లవారుజాము నుంచే వేద మంత్రాలు మార్మోగాయి. చతుర్వేద పారాయణంతో యాగ క్రతువు ప్రారంభమైంది. ప్రధాన యాగ క్రతువుల కోసం 32 మంది రుత్వికులు యాగశాలలో నిర్దేశించిన స్థానాల్లో ఆశీనులు కాగా, మిగిలిన రుత్వికులు నిరంతర వేద పారాయణం, జపంలో పాల్గొన్నారు. చతుర్వేద పారాయణం అనంతరం అగ్ని ప్రతిష్ఠాపన నిర్వహించారు. హోమకుండాల్లో పవిత్ర అగ్నిని ప్రజ్వలింపజేసి, వరుణ దేవుడిని ఆవాహన చేస్తూ హోమాలు నిర్వహించారు. ఆకాశం--జలం--భూమి--మానవాళి మధ్య సమతుల్యత నెలకొనాలని ఆకాంక్షిస్తూ వేద మంత్రాల నడుమ హోమ ద్రవ్యాలను అగ్నికి సమర్పించారు. ఒకవైపు కృష్ణమ్మ విశాల జలరాశి, మరోవైపు హోమకుండాల్లో ఎగసిపడుతున్న అగ్నిజ్వాలలు, వాటి మధ్య ప్రతిధ్వనించిన వేదఘోషతో సాగర్ తీరం భక్తిభావంతో నిండిపోయింది. మహా వరుణ యాగం నిర్వహిస్తున్న ప్రాంతానికి చారిత్రక ప్రాధాన్యం కూడా ఉందని యాగ నిర్వాహకులు పేర్కొన్నారు. నేటి నాగార్జునసాగర్ ప్రాంతం ఒకనాటి విజయపురిగా ప్రసిద్ధి చెందిందని, ఈ ప్రాంతంలో ప్రాచీన కాలంలోనే వరుణారాధన జరిగినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయని వేద పండితులు వివరించారు.



## నాగోల్‌లో 'సోలిటైర్ జిమ్' ప్రారంభం

- ఆధునిక హంగులతో ఫిట్‌నెస్ సెంటర్ పునరుద్ధరణ
- హాజరైన సినీ నటి శ్రావంతి చొక్కారపు, సంస్థ ప్రతినిధులు



**తొలివెలుగు, నాగోల్ :** నగరంలో గత దశాబ్ద కాలంగా ఫిట్‌నెస్ రంగంలో సేవలందిస్తున్న 'సోలిటైర్ ఫిట్‌నెస్' సంస్థ.. నూతన వసతులతో 'సోలిటైర్ జిమ్'గా రూపాంతరం చెందింది. నాగోల్‌లో ఆధునికీకరించిన ఈ జిమ్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సినీ, టీవీ నటి శ్రవంతి చొక్కారపు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సోలిటైర్ ఇంటర్నేషనల్ ఎల్‌ఎల్‌పీ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ మిర్ ముర్తుజా అలీ మాట్లాడుతూ.. 2014 నుంచి హైదరాబాద్‌లో ఫిట్‌నెస్ రంగానికి సేవలు అందిస్తున్నామని, సభ్యుల అవసరాలకు అనుగుణంగా ఆధునిక పరికరాలు, విశాలమైన శిక్షణ ప్రాంగణం, సర్టిఫైడ్ ట్రైనర్ల మార్గదర్శకత్వంలో జిమ్‌ను రీవ్యాంప్ చేసినట్లు తెలిపారు. మహిళలు, సీనియర్ సిటిజన్లకు ఇక్కడ ప్రత్యేక శిక్షణ తరగతులు అందుబాటులో ఉంటాయన్నారు. త్వరలోనే అత్తాపూర్, మెహదీపట్నం, షేక్‌పేట్, మణికొండ శాఖలను కూడా అప్‌గ్రేడ్ చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ దనియాల్ ముర్తుజా అలీ, సిఎమ్‌టి డైరెక్టర్ సులైమాన్ ముర్తుజా అలీ పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి







- రామన్నపేటలో రైతు, కార్మిక సంఘాల 'జైల్ భరో'
- రహదారిపై రాస్తారోకో.. నాయకుల అరెస్టు

**తొలివెలుగు, రామన్నపేట :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగే సోములు పిలుపునిచ్చారు. సోమవారం రామన్నపేట మండల కేంద్రంలో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో 'జైల్ భరో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారిపై నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో చేపట్టి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతులు, కార్మికులు, పేదల ప్రయోజనాలను విస్మరించి కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైందని, ఉపాధి హామీ పథకంలో పనిదినాలు, కూలి రేట్లు పెంచి బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను బలహీనపరుస్తూ హక్కులను హరించడాన్ని నిరసించారు. అనంతరం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సంఘాల మండల నాయకులు గన్నెబోయిన విజయభాస్కర్, బోయిని ఆనంద్, కందుల హనుమతు, నకిరకంటి రాము, కల్లూరి నగేష్, మేడబోయిన శ్రీనివాస్, అవనగంటి నగేష్, బావండ్లపల్లి బాలరాజు, మునికుంట్ల లెనిన్, మేడి గణేష్, అప్పం సురేందర్, తాళ్లపల్లి జితేందర్, నాగటి లక్ష్మణ్, శానగొండ వెంకటేశ్వర్లు, బందెల బిక్షం, బుడ్డ ప్రసాద్, పల్లె సత్యం తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

- ఉస్మానియా మార్చురీలో భద్రపరిచిన పోలీసులు
- ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి



**తొలివెలుగు, ఎల్‌బీనగర్ :** సాగర్ ఎక్స్‌రోడ్స్ ప్రాంతంలో సోమవారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయస్సున్న ఓ వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ ఎన్.మహేష్, ఏఆర్‌పీసీలకు పెట్రోలింగ్ డ్యూటీలో సమాచారం అందింది. దీంతో వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సదరు వ్యక్తి కొంతకాలంగా ఫ్లైఓవర్ కింద నివాసముంటూ యాచిస్తూ జీవిస్తున్నట్లు స్థానిక విచారణలో తెలిసింది. మృతుడు నలుపు రంగు రౌండ్‌నెక్ టీషర్ట్, చెక్స్ ట్రాక్‌ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని, మృతుడి గుర్తింపు లేదా ఆచూకీ తెలిసిన వారు ఎల్‌బీనగర్ పోలీసులను సంప్రదించాలని అధికారులు కోరారు.

# క్విట్ ఇండియా స్ఫూర్తితో కేంద్ర విధానాలపై పోరాడాలి



- పోచంపల్లిలో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల 'జైల్ భరో'
- నేతాజీ చౌరస్తాలో రాస్తారోకో.. భారీ ర్యాలీ
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండమడుగు నరసింహ

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో పోరాటాలను మరింత ఉధృతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండమడుగు నరసింహ పిలుపునిచ్చారు. సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం భూదాన్ పోచంపల్లిలో 'జైల్ భరో', రాస్తారోకో కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి నేతాజీ చౌరస్తా వరకు కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నేతాజీ చౌరస్తా వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

**కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర విధానాలు:**

ఈ సందర్భంగా కొండమడుగు నరసింహ మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ దేశ కార్మిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. కార్మికుల హక్కులను పరిరక్షించే చట్టాలను బలహీనపరుస్తూ శ్రమదోపిడీకి అవకాశం కల్పించే విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు, గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన వివిధ మార్గదర్శకాల వల్ల కార్మికులు, వ్యవసాయ కార్మికులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్మిక హక్కులను కాపాడేందుకు దేశవ్యాప్తంగా కార్మిక లోకం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, మాజీ డివిజన్ కార్యదర్శి గూడూరు అంజిరెడ్డి, సీఐటీయూ మండల, పట్టణ కన్వీనర్లు మంచాల మధు, వడ్డేపల్లి యాదగిరి, రైతు సంఘం మండల ప్రజాప్రతినిధులు పగిళ్ల లింగారెడ్డి, గూడూరు బుచ్చిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బొడ్డు కిషన్, ప్రసాదం విష్ణు, ప్రజాసంఘాల బాధ్యులు అందెల జ్యోతి, గూడూరు రాంరెడ్డి, పత్తి బిక్షపతి, వారాల మల్లారెడ్డి, అరుణ, జయమ్మ, శారద, పద్మ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## ఘనంగా పైళ్ల శేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

- పోచంపల్లిలో కేక్ కట్ చేసిన బీఆర్ఎస్ శ్రేణులు
- నియోజకవర్గ అభివృద్ధికి శేఖర్‌రెడ్డి కృషి ఎనలేనిది: మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో బీఆర్ఎస్ మండల, పట్టణ శాఖల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి శేఖర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భువనగిరి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు పైళ్ల శేఖర్‌రెడ్డి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపారని తెలిపారు. పైళ్ల శేఖర్‌రెడ్డికి ప్రజల్లో మంచి ఆదరణ ఉందని, ఆయన సేవలను ప్రజలు ఎప్పటికీ మరచిపోరని అన్నారు. రాబోయే రోజుల్లో ఆయన మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నికై నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే అవకాశం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శేఖర్‌రెడ్డికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కందడి భూపాల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్‌యాదవ్, మండల, పట్టణ శాఖల అధ్యక్షులు పాటి సుధాకర్‌రెడ్డి, సీతా వెంకటేష్, మండల ప్రధాన కార్యదర్శి చిలువేరు బాల నరసింహ, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఆర్ల కావ్య వెంకటేష్, నర్మద సత్యనారాయణ, పెద్దల చక్రపాణి, బాత్క లింగస్వామి యాదవ్, బత్తుల శ్రీశైలం గౌడ్, మన్నె పద్మారెడ్డి, నోముల మాధవరెడ్డి, ఆర్ల లింగస్వామి యాదవ్, సురవి కాటంరాజు, చింతకింది కిరణ్, సీత శ్రవణ్, నోముల ఉపేందర్‌రెడ్డి, కర్నాటి అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ఇంద్రపాల ముత్యాలమ్మ గుడికి మహర్దశ

- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీగా కాలువ నిర్మాణం
- భక్తుల కోసం పార్కింగ్ వసతులు: సర్పంచ్ విక్రమ్

**తొలివెలుగు, రామన్నపేట :** ఇంద్రపాలనగరం గ్రామంలోని శ్రీశ్రీశ్రీ ఇంద్రపాల ముత్యాలమ్మ తల్లి దేవాలయ ప్రాంగణ అభివృద్ధి పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా మరింత విశాలమైన ప్రాంగణంతో పాటు పార్కింగ్ వసతి కల్పించేలా అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని గ్రామ సర్పంచ్ గార్ధాస్ విక్రమ్ తెలిపారు. ఆలయం ముందు ఉన్న మురుగు కాలువ స్థానంలో సిమెంట్ ఆర్‌సీసీ పైపులు అమర్చి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీగా మారుస్తున్నట్లు వెల్లడించారు. కాలువ పైభాగం పూడ్చివేయడం వల్ల ఆలయ పరిసరాలు సుందరీకరణ చెందడంతో పాటు వాహనాల నిలుపుదలకు తగిన స్థలం అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు వడ్లకొండ బిక్షపతి, బొల్ల మత్స్యగిరి, కనకబోయిన లింగస్వామి, నీరుడు వెంకటేష్, మేకల నరేందర్, పుట్టాల నాగరాజు, వడ్లకొండ చింటూ, గార్ధాస్ సాయి తదితరులు పాల్గొన్నారు.




# వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లో ఘనంగా బోనాల ఉత్సవాలు



- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
- అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు

**తొలివెలుగు, ఎల్‌బీనగర్:** వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్‌లో బోనాల పండుగ ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బోనాల వేడుకలకు ఎల్‌బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ ఉత్సవాలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ లగ్గొని శ్రీధర్ గౌడ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.





# బాధిత కుటుంబానికి 'సుధీర్‌రెడ్డి' ఆపన్నహస్తం

- రూ.2.60 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత
- పేదలకు సేవ చేయడం ఎంతో సంతృప్తినిస్తుంది: ఎమ్మెల్యే

**తొలివెలుగు, ఎల్‌బీనగర్ :** ఊపిరితిత్తుల సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎస్‌కేడీ నివాసి ప్రసాద్ చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ. 2.60 లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. బాధిత కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు స్పందించిన ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ నుంచి నిధులు మంజూరయ్యేలా చొరవ తీసుకున్నారు. అనంతరం మంజూరైన చెక్కును ప్రసాద్ భార్య ధనలక్ష్మికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజలకు అండగా నిలిచి సేవ చేయడంలోనే తనకు నిజమైన సంతృప్తి లభిస్తుందన్నారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక పేద కుటుంబాలకు ఆపన్నహస్తం అందించే అవకాశం లభించిందని తెలిపారు. తమ కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకుని ఆర్థిక సాయం అందేలా చూసిన ఎమ్మెల్యేకు బాధితుడి భార్య ధనలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, రాజశేఖర్, మంద రాజశేఖర్‌రెడ్డి, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

# దొంతు సత్తయ్య పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

- ఘనంగా కమ్యూనిస్టు నేత 6వ వర్ధంతి
- స్మారక స్థూపానికి నాయకులు, కుటుంబీకుల నివాళి




**తొలివెలుగు, చిన్నగూడూరు :** స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు దొంతు సత్తయ్య పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని సీపీఐ నాయకులు కొనియాడారు. సత్తయ్య ఆరవ వర్ధంతి వేడుకలను మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం గుండంరాజుపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని దొంతు సత్తయ్య – సుశీల దంపతుల స్మారక స్థూపానికి పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజల హక్కుల కోసం, కమ్యూనిస్టు సిద్ధాంతాల వ్యాప్తికి సత్తయ్య చేసిన సేవలు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ గ్రామ కార్యదర్శి గంజి శేషాద్రి, సీనియర్ నాయకుడు కందుల వెంకటయ్య, సత్తయ్య కుటుంబ సభ్యులు, గ్రామ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# చేర్యాలకు బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

- వారంగా నిలిచిన యాదగిరిగుట్ట - చేర్యాల ఆర్టీసీ బస్సు
- తీవ్ర అవస్థలు పడుతున్న ప్రయాణికులు, విద్యార్థులు

**తొలివెలుగు, రాజాపేట :** యాదగిరిగుట్ట నుంచి రాజాపేట మీదుగా చేర్యాలకు నడిచే ఆర్టీసీ బస్సు సర్వీసును తక్షణమే పునరుద్ధరించాలని ఈ ప్రాంత ప్రయాణికులు కోరుతున్నారు. గతంలో నిత్యం ఉదయం 8.30 గంటలకు యాదగిరిగుట్ట నుంచి బయలుదేరి రాజాపేట మీదుగా చేర్యాలకు బస్సు నడిచేది. దీనివల్ల నిత్యం రాకపోకలు సాగించే విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలకు రవాణా సౌకర్యం సౌకర్యవంతంగా ఉండేది. అయితే గత వారం రోజులుగా ఈ బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు. దీంతో రాజాపేటతో పాటు పరిసర గ్రామాల ప్రజలు చేర్యాల వైపు, అలాగే సికింద్రాబాద్ వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయ రవాణా సాధనాలు లేక అవస్థలు పడుతున్నామని, విద్యార్థులు సమయానికి కళాశాలలకు వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి నిలిపివేసిన బస్సు సర్వీసును పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.







**తొలివెలుగు, రాజాపేట :** రఘునాథపురం మండల ఏర్పాటు డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది. 380 రోజుల పాటు నిరంతర రిలే నిరాహార దీక్షలు, మూడేళ్లుగా నిరీక్షణ, పలుమార్లు ప్రభుత్వానికి వినతులు.. అయినప్పటికీ రఘునాథపురం మండల ఏర్పాటుపై ఇప్పటివరకు స్పష్టమైన నిర్ణయం లేకపోవడంతో స్థానిక ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ రఘునాథపురాన్ని నూతన మండలంగా ప్రకటించడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని మండల సాధన జేఏసీ నాయకులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తమ సుదీర్ఘ పోరాటాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**2022లో ప్రారంభమైన మండల సాధన ఉద్యమం:**

రఘునాథపురాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు, మండల సాధన జేఏసీ ఆధ్వర్యంలో 2022 ఆగస్టులో రిలే నిరాహార దీక్షలకు శ్రీకారం చుట్టారు. ఉద్యమానికి రఘునాథపురం పరిసర గ్రామాల ప్రజలు, ప్రజా సంఘాలు, అఖిలపక్ష నాయకులు, వివిధ వర్గాల ప్రజలు మద్దతు తెలిపారు. మండల సాధన కోసం చేపట్టిన పోరాటం రోజురోజుకు ఉధృతమవుతూ 2022 నవంబర్ 17 నాటికి 100వ రోజుకు చేరింది. అనంతరం 2023 ఏప్రిల్ 26 నాటికి 260 రోజుల పాటు దీక్షలు కొనసాగాయి. అదే ఏడాది ఆగస్టు 24 నాటికి ఉద్యమం 380వ రోజుకు చేరుకుంది. సుదీర్ఘకాలం పాటు జరిగిన ఈ ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారినప్పటికీ, ఇప్పటికీ మండల ఏర్పాటుపై స్పష్టత రాకపోవడంతో ప్రజల్లో నిరాశ నెలకొంది.

**హామీ నెరవేర్చాలని డిమాండ్:**

రఘునాథపురం మండల ఏర్పాటుపై ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అసెంబ్లీలో ప్రస్తావించారని స్థానికులు గుర్తుచేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో కూడా రఘునాథపురాన్ని మండలంగా ఏర్పాటు చేసేందుకు హామీ ఇచ్చినట్లు వారు పేర్కొంటున్నారు. అయితే హామీలు, ఉద్యమాలు, ప్రజల విజ్ఞప్తులు ఉన్నప్పటికీ ఇప్పటివరకు మండల ఏర్పాటుకు సంబంధించిన అధికారిక గెజిట్ వెలువడకపోవడంపై మండల సాధన జేఏసీ నాయకులు, గ్రామ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లుగా మండల ఏర్పాటు కోసం ఎదురుచూస్తున్నామని, ఇకనైనా ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు.

**విప్ చొరవ చూపాలని ప్రజల విజ్ఞప్తి:**

రఘునాథపురం మండల ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రత్యేక చొరవ చూపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అర్హతలున్న రఘునాథపురాన్ని నూతన మండలంగా ప్రకటించి, వెంటనే అధికారిక గెజిట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 380 రోజుల పోరాటం.. మూడేళ్ల ఎదురుచూపులు.. హామీల అమలుపై ఇంకా నీలినీడలు.. ఇకనైనా ప్రభుత్వం స్పందించి రఘునాథపురం ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# నాగార్జునసాగర్‌లో ఘనంగా వరుణ యాగం





- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పూల బొకేతో స్వాగతం పలికిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**తొలివెలుగు, నాగార్జునసాగర్ :** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ నాగార్జునసాగర్‌లో నిర్వహించిన వరుణ యాగం సోమవారం భక్తిశ్రద్ధలతో సాగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరుణ యాగంలో పాల్గొనేందుకు నాగార్జునసాగర్‌కు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పూల బొకే అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరిన ముఖ్యమంత్రి నాగార్జునసాగర్‌లోని విజయ్‌విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ముఖ్యమంత్రిని సాదరంగా ఆహ్వానించారు. విజయ్‌విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో వరుణ యాగాన్ని నిర్వహించారు. ఈ యాగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

**108 మంది రుత్వికులతో యాగం:**

వేద మంత్రోచ్చారణల మధ్య 108 మంది రుత్వికులు, 11 హోమగుండాలతో వరుణ యాగ కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని, కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో జలవనరులు సమృద్ధిగా ఉండాలని, పంటలు బాగా పండాలని ఈ సందర్భంగా ప్రార్థనలు చేశారు. రైతులకు సాగునీరు పుష్కలంగా లభించి వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షిస్తూ యాగం నిర్వహించారు.

**రాష్ట్ర సుభిక్షత కోసమే వరుణ యాగం: బీర్ల అయిలయ్య**

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, రైతుల అభివృద్ధి, పంటలకు అనుకూలంగా సమృద్ధిగా వర్షాలు కురవాలనే సంకల్పంతో వరుణ యాగం నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రైతులకు సాగునీరు సమృద్ధిగా అందాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాగార్జునసాగర్ పర్యటన సందర్భంగా ఆయనకు స్వాగతం పలికి, వరుణ యాగంలో పాల్గొనే అవకాశం లభించడం ఆనందంగా ఉందని బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. వరుణ యాగంతో నాగార్జునసాగర్ ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.



# కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- రాజాపేటలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో హమాలీ కార్మికుల నిరసన
- అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ఉపసంహరించుకోవాలి: నర్సింహులు

**తొలివెలుగు, రాజాపేట :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని శక్తి హమాలీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) నాయకుడు బుగ్గ నర్సింహులు డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లను, అమెరికాతో భారత ప్రభుత్వం కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరుతూ సోమవారం రాజాపేటలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో హమాలీ కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల యాజమాన్యాల చేతిలో కార్మికుల శ్రమ దోపిడీ తీవ్రమవుతుందన్నారు. అమెరికాతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వల్ల దేశీయంగా ఉత్పత్తి అయ్యే వ్యవసాయ పంటలు, ఆహార పదార్థాలు, వస్తువుల విక్రయాలు నిలిచిపోయి కుప్పలుగా పడి ఉండే ప్రమాదం ఉందన్నారు. ఫలితంగా దేశం విదేశీ వస్తువులపై ఆధారపడటంతో పాటు భారత వ్యవసాయ రంగం, రైతాంగం తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు బుగ్గ కొమురయ్య, పెద్దోళ్ల కనకయ్య, ఎమ్మ బాలరాజు, కోయ బాబు, దయ్యాల రవి, మేక ఉపేందర్, పుప్పాల మల్లయ్య, కాలె నర్సింహులు, బచ్చలి నర్సింహులు, కొసిగ వీరయ్య, జూకంటి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్సైని సన్మానించిన బొందుగుల సర్పంచ్, ఉపసర్పంచ్

- రాజాపేట ఎస్ఐ మహమ్మద్ తక్యుద్దీన్‌కు శాలువాతో ఘన సత్కారం



**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన మహమ్మద్ తక్యుద్దీన్‌ను రాజాపేట మండలం బొందుగుల గ్రామ సర్పంచ్ పయ్యావుల ఎల్లయ్య, ఉపసర్పంచ్ ఆబిద్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ మహమ్మద్ తక్యుద్దీన్‌కు శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రాజాపేట మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు ఆయన కృషి చేయాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు పోలీసులు మరింత చేరువ కావాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషించాలని సర్పంచ్ పయ్యావుల ఎల్లయ్య పేర్కొన్నారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహమ్మద్ తక్యుద్దీన్ మాట్లాడుతూ, తనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన బొందుగుల గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాజాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరిస్తే నేరాల నియంత్రణ మరింత సులభమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొందుగుల గ్రామ సర్పంచ్ పయ్యావుల ఎల్లయ్య, ఉపసర్పంచ్ ఆబిద్ తదితరులు పాల్గొన్నారు.

# రాజాపేటలో సీపీఐ ప్రజా చైతన్య యాత్ర

- 'బదలావ్ జరూర్ హై' నినాదంతో ప్రచారం.. కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు

**తొలివెలుగు, రాజాపేట :** కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో రాజాపేట మండల కేంద్రంలో సోమవారం ప్రజా చైతన్య ప్రచార యాత్ర నిర్వహించారు. 'బదలావ్ జరూర్ హై' నినాదంతో చేపట్టిన ఈ యాత్రలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రజలకు కేంద్ర ప్రభుత్వ విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరుగుతూ సామాన్య ప్రజలపై తీవ్ర భారం పడుతోందన్నారు. మరోవైపు నిరుద్యోగ సమస్య మరింత పెరిగి యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. దేశంలో మార్పు అవసరమనే సందేశంతో సీపీఐ ప్రజల్లోకి వెళ్తోందని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ప్రజా చైతన్య యాత్రకు స్థానిక ప్రజల నుంచి స్పందన లభించిందని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







**తొలివెలుగు, రాజాపేట :** మదర్ డైరీని ఎన్డీడీబీకి అప్పగించి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ డైరీ ఆర్థిక, పరిపాలనా సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదని రైతులు, కొందరు పాల సహకార సంఘాల చైర్మన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అతి విలువైన ఆస్తులు విక్రయించినప్పటికీ రైతులకు చెల్లించాల్సిన పాల బిల్లులు, ఇతర బకాయిలు ఇంకా భారీగా పెండింగ్‌లోనే ఉన్నాయని ఆరోపిస్తున్నారు. డైరీ నిర్వహణలో పారదర్శకత లోపించిందని, రైతుల సంక్షేమం కోసం స్పష్టమైన కార్యాచరణ కనిపించడం లేదని విమర్శిస్తున్నారు. మదర్ డైరీ ఆస్తులను విక్రయించినప్పటికీ సుమారు రూ.20 కోట్ల మేర రైతుల బిల్లులు, ఇతర అప్పులు ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఎన్డీడీబీకి డైరీ నిర్వహణను అప్పగించిన సందర్భంగా అమలు చేస్తున్న నిబంధనలు, ఒప్పందంలోని ముఖ్యాంశాలను రైతులు, పాల ఉత్పత్తిదారులకు పూర్తిస్థాయిలో వెల్లడించలేదని వారు ఆరోపిస్తున్నారు.

### ప్రతినెలా రూ.2 కోట్ల నష్టాలా?

డైరీకి వస్తున్న ఆదాయం, నిర్వహణ ఖర్చులను లెక్కిస్తే ప్రతినెలా సుమారు రూ.2 కోట్ల మేర నష్టాలు వస్తున్నట్లు తాము అంచనా వేస్తున్నామని కొందరు రైతులు, సొసైటీ చైర్మన్లు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో డైరీ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు, పాల సేకరణను పెంచేందుకు, వ్యయాలను నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అయితే మదర్ డైరీ భవిష్యత్తు, రైతుల సంక్షేమంపై పాలకవర్గం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించకపోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. రైతుల నుంచి పాల సేకరణ పెంపుపై దృష్టి పెట్టకుండా, అంతర్గత వివాదాలు, పరిపాలనా నిర్ణయాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ఉద్యోగులపై చర్యల్లో వివక్ష ఉందా?

డైరీలో కొందరు ఉద్యోగులు చేసిన తప్పులపై కఠిన చర్యలు తీసుకోకుండా, మరికొందరిపై చిన్నచిన్న ఆరోపణలతో సస్పెన్షన్ వంటి చర్యలు తీసుకుంటున్నారని కొందరు రైతులు, ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి. గతంలో మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేసిన కృష్ణను అనవసరమైన ఆరోపణలతో సస్పెండ్ చేసి, ఇప్పటివరకు విధుల్లోకి తీసుకోలేదని విమర్శిస్తున్నారు. ఆయన సస్పెన్షన్ వ్యవహారం కారణంగా న్యాయపరమైన ఖర్చుల పేరిట డైరీ నిధులు భారీగా ఖర్చవుతున్నాయని కొందరు ఆరోపించారు. గత ఆరు నెలలుగా కోర్టు కేసులపై సుమారు రూ.2 కోట్ల వరకు డైరీ నిధులు ఖర్చు చేసినట్లు వారు పేర్కొంటున్నారు. అయితే ఈ ఆరోపణలపై మదర్ డైరీ యాజమాన్యం, పాలకవర్గం నుంచి పూర్తి స్థాయి అధికారిక వివరణ రావాల్సి ఉంది.

### ఎన్డీడీబీ తిరస్కరిస్తున్న పాలపై స్పష్టత ఇవ్వాలి:

ఎన్డీడీబీ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల కారణంగా తిరస్కరణకు గురవుతున్న పాల విషయంలో రైతులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని సొసైటీ చైర్మన్లు డిమాండ్ చేస్తున్నారు. తిరస్కరించిన పాలు, వాటి వల్ల కలిగే ఆర్థిక నష్టాన్ని ఎవరు భరించాలనే అంశంపై కూడా స్పష్టత లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాల నాణ్యత పెంపునకు రైతులకు అవగాహన కల్పించడం, అవసరమైన సాంకేతిక సహాయం అందించడం, తిరస్కరణలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై డైరీ యాజమాన్యం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కోరుతున్నారు.

**మదర్ డైరీ భవిష్యత్తుపై ఆందోళన:**

**ఒకవైపు రైతులకు బకాయిల భారం, మరోవైపు ప్రతినెలా భారీ నష్టాలు, ఆస్తుల విక్రయం, పాల సేకరణలో సమస్యలు, ఉద్యోగుల మధ్య వివాదాలు.. ఇలా మదర్ డైరీ సమస్యలు పెరుగుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారానికి చర్యలు కనిపించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఎన్డీడీబీకి డైరీని అప్పగించడం వల్ల రైతులకు, పాల ఉత్పత్తిదారులకు ఎలాంటి ప్రయోజనం కలుగుతుందో స్పష్టంగా వివరించాలని డిమాండ్ చేస్తున్నారు. విలువైన ఆస్తులు విక్రయించిన తర్వాత కూడా రైతుల బకాయిలు చెల్లించకపోవడం, డైరీ ఆర్థిక పరిస్థితి మెరుగుపడకపోవడంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవ పరిస్థితిని వెల్లడించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా మదర్ డైరీ పాలకవర్గం, సంబంధిత అధికారులు స్పందించి రైతుల పెండింగ్ బిల్లుల చెల్లింపుకు చర్యలు చేపట్టాలని, డైరీ ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకు ప్రత్యేక పునరుద్ధరణ ప్రణాళిక ప్రకటించాలని రైతులు, పాల సహకార సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. రైతుల నమ్మకాన్ని నిలబెట్టేలా, మదర్ డైరీ మనుగడను కాపాడేలా తక్షణ దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.**

# నవభారత్ యూత్ అధ్యక్షుడిగా కోయ యాకూబ్

- ఉపాధ్యక్షుడిగా పెద్దోళ్ల కమలాకర్.. కార్యదర్శిగా రామ్‌గళ్ల కిరణ్




**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేటలోని నవభారత్ యూత్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కోయ యాకూబ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నిర్వహించిన యూత్ అసోసియేషన్ ఎన్నికల్లో సభ్యులందరి ఏకాభిప్రాయంతో ఆయనను అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. అలాగే ఉపాధ్యక్షుడిగా పెద్దోళ్ల కమలాకర్, కార్యదర్శిగా రామ్‌గళ్ల కిరణ్‌లను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అనంతరం నూతన కమిటీ సభ్యులను పలువురు నాయకులు, యూత్ సభ్యులు అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కోయ యాకూబ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి నవభారత్ యూత్ అసోసియేషన్ అధ్యక్ష బాధ్యతలను అప్పగించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. యువత అందరి సహకారంతో నవభారత్ యూత్ అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేస్తామని, సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపడతామని అన్నారు. గ్రామంలో యువతను ఐక్యంగా ముందుకు తీసుకెళ్లడంతో పాటు పేదలు, అవసరమైన వారికి సహాయం అందించే దిశగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. క్రీడలు, సామాజిక సేవ, ప్రజా ప్రయోజన కార్యక్రమాల్లో యూత్ సభ్యులు చురుకుగా పాల్గొనేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజాపేట సర్పంచ్ మధు, మాజీ ఉపసర్పంచ్ కోయ ఉపేందర్, దేశాపండ ప్రసాద్, నవభారత్ యూత్ మాజీ అధ్యక్షుడు కోయ జాన్, సిరిపందా కుమార్, రాజు, ఆంజనేయులు, రవి, రంగోల శ్రీనివాస్‌తో పాటు పలువురు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

- అధ్యక్షుడిగా చిలువేరు సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా గంజి నరసింహారావు
- సమాజ అభ్యున్నతికి కృషి చేస్తాం: నూతన అధ్యక్షుడు

**తొలివెలుగు, మునుగోడు:** మునుగోడు పట్టణ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం సోమవారం స్థానిక మార్కండేయ ఆలయ ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నల్లగొండ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు పొట్టబత్తిని సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి రవీందర్, నల్లగొండ పట్టణ అధ్యక్షుడు మిరియాల స్వామి, ఉపాధ్యక్షుడు మిర్యాల వెంకటేశం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన అధ్యక్షుడిగా చిలువేరు సుదర్శన్, ఉపాధ్యక్షులుగా ఆల్వాల వెంకయ్య, మిర్యాల రమాశంకర్, ప్రధాన కార్యదర్శిగా గంజి నరసింహారావు, సహాయ కార్యదర్శులుగా మిరియాల వీరేశం, మిరియాల కైలాసం, కోశాధికారిగా సింగం గిరిధర్‌లతో ముఖ్య అతిథులు ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే డైరెక్టర్లుగా చెరుపల్లి నరసింహ, సింగం వెంకటరమణ, దోర్నాల శ్రీను, కర్నాటి రాజు, చిలువేరు రాజశేఖర్‌లు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు చిలువేరు సుదర్శన్ మాట్లాడుతూ పద్మశాలి సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. అందరి సహకారంతో చేనేత రంగాన్ని, పద్మశాలి సమాజ అభ్యున్నతిని మరింత ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షుడు అవ్వారీ భాస్కర్, పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు మిర్యాల మధుకర్, మార్కండేయ దేవాలయ అధ్యక్షుడు కొంగరి కృపానంద్, గౌరవ సలహాదారులు సంగిశెట్టి పరమేశం, మారం బుచ్చయ్య పాల్గొన్నారు.





# కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

- చౌటుప్పల్‌లో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల 'జైల్ భరో'
- కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాస్తోంది: ఎండి జహంగీర్

**తొలివెలుగు, చౌటుప్పల్ :** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండి జహంగీర్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ చౌటుప్పల్‌లో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించి 'జైల్ భరో' కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కార్మికులు, రైతులు, సాధారణ ప్రజల ప్రయోజనాలను దెబ్బతీస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్‌ల అమలుకు ఫైనల్ రూల్స్ నోటిఫై చేయడంతో పాటు పని వేళలను 8 గంటల నుంచి 12 గంటలకు పెంచేందుకు యాజమాన్యాలకు పూర్తి స్వేచ్ఛనివ్వడం ఘోరమన్నారు. విద్యుత్ సవరణ బిల్లు, విత్తన చట్ట సవరణలతో రైతాంగానికి, సామాజిక భద్రత కోడ్‌లతో భవన నిర్మాణం, హమాలీ, రవాణా, బీడీ వంటి అసంఘటిత రంగ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తరతరాల పోరాటాలతో సాధించుకున్న హక్కులను రక్షించుకోవడానికి 4 లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకునే వరకు పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎండి పాషా, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు, కార్మిక సంఘాల నాయకులు చీక అలివేలు, గోశిక కరుణాకర్, చీర్క సంజీవరెడ్డి, ఆదిమూల నందీశ్వర్, చీమకళ్ల శ్రీరాములు, జొన్నకంటి దేవయ్య, చింతల సుదర్శన్, ఆకుల ధర్మయ్య, బాతురాజు దశరథ, యాట బాలరాజు, కొంతం శ్రీనివాస్ రెడ్డి, చెరుకు లక్ష్మమ్మ, జక్కిడి అంజిరెడ్డి, యాట వెంకటేశం, తూర్పునూరు మల్లేశా, కొండ శ్రీశైలం, మీసాల శ్రీను, యాదయ్య, మల్లమ్మ, జ్యోతి, నరసింహ, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, మాంద్ర కోటయ్య పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు భారీ షాక్.. బీఆర్ఎస్‌లో 50 కుటుంబాల చేరిక





- అశ్వారావుపేటలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా సమక్షంలో చేరికలు
- హామీలు నమ్మి మోసపోయాం: గ్రామస్థుల ఆవేదన

**తొలివెలుగు, అశ్వారావుపేట :** అధికార కాంగ్రెస్ పార్టీ మాయమాటలు నమ్మి మోసపోయామని, కేసీఆర్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని పేర్కొంటూ కావడిగుండ్ల గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాలు సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరాయి. అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు వారికి పార్టీ గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా అటకెక్కిందన్నారు. తాము గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తీసుకొచ్చిన పనులను కూడా పూర్తి చేయలేని దుస్థితిలో ప్రస్తుత ప్రభుత్వం ఉందని విమర్శించారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా కంటికి రెప్పలా కాపాడుకుంటామని అభయమిచ్చారు. పార్టీలో చేరిన వారిలో కొమరం రవి, కణితి వెంకటేష్, బాలు, కొమరం హిమచందు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జూపల్లి రమణారావు, మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, మోహన్‌రెడ్డి, యూఎస్ ప్రకాశ్‌రావు, సంక ప్రసాద్, కలపాల బాబురావు, ఉప సర్పంచ్ పాకనాటి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ నారం రాజశేఖర్, సంకుల స్వరూప, శ్రీదేవి, ఏలేటి పార్వతి, కలపాల సురేష్, ఆసిఫ్, ఆరేపల్లి రాంబాబు, చిప్పనపల్లి శ్రీను, ధర్మా, లింగంకుంట కృష్ణ, బుజ్జిబాబు, అలా లింగేశ్వరరావు, ఆకుల శ్రీను, చిన్నంశెట్టి రాంబాబు, వార్డు సభ్యుడు సురేష్, నారాయణ, జజ్జూరపు రాంబాబు, దుర్గారావు, నార్లపాటి వెంకన్నబాబు, నందికొల్ల వెంకన్నబాబు, తుంపాటి రమేష్, నార్లపాటి వెంకటేశ్వరరావు, దిలీప్, అమీర్, నార్లపాటి బన్ను, నార్లపాటి ప్రదీప్, నాగు, ప్రేమకుమారి పాల్గొన్నారు.



## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- తంగడపల్లిలో పోలీసుల 'యాంటీ డ్రగ్ అవేర్‌నెస్' కార్యక్రమం
- డ్రగ్స్ నిర్మూలనకు ప్రజలు సహకరించాలి: సీఐ మన్మథకుమార్

**తొలివెలుగు, చౌటుప్పల్ :** యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితాన్ని, బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జీ. మన్మథకుమార్ పిలుపునిచ్చారు. చౌటుప్పల్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం తంగడపల్లి గ్రామంలో 'యాంటీ డ్రగ్ అవేర్‌నెస్' (మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ కే. యాదగిరి, పోలీస్ సిబ్బందితో కలిసి సీఐ గ్రామంలో ప్రజలకు, యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం క్షీణించడమే కాకుండా భవిష్యత్తు పూర్తిగా నాశనమవుతుందన్నారు. యువత పెడదోవ పట్టకుండా తల్లిదండ్రులు, గ్రామస్థులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో డ్రగ్స్ లేదా మత్తు పదార్థాల అమ్మకాలు, వినియోగం ఉన్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పోలీసులతో కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.



## తమిళనాడు రాష్ట్ర గీతంపై అసెంబ్లీ తీర్మానం..



తమిళనాడు శాసనసభ సోమవారం ఒక చారిత్రక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ విభాగాలు, విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వహించే అధికారిక కార్యక్రమాలను ఇకపై తప్పనిసరిగా రాష్ట్ర గీతమైన 'తమిళ తాయ్ వాళు'తోనే ప్రారంభించాలని ఈ తీర్మానం స్పష్టం చేస్తోంది. ముఖ్యమంత్రి విజయ్ సభలో ఈ ప్రత్యేక తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, డీఎంకే, అన్నాడీఎంకే, కాంగ్రెస్, బీజేపీ సహా సభలోని అన్ని పక్షాలు దీనికి సంపూర్ణ మద్దతు తెలిపాయి. అనంతరం మూజువాణి ఓటింగ్ ద్వారా ఈ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు స్పీకర్ జె.సి.డి. ప్రభాకర్ ప్రకటించారు. ఈ నిర్ణయంపై ముఖ్యమంత్రి విజయ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, మద్దతు తెలిపిన అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు. ఇది తమిళ అస్తిత్వానికి, భాషా గౌరవానికి దక్కిన చారిత్రక విజయమని ఆయన అభివర్ణించారు. "తమిళం కేవలం ఒక భాష కాదు, అది ఒక ఆలోచన, సంస్కృతి, నాగరికత, జీవన విధానం, చైతన్యం" అని ఆయన పేర్కొన్నారు. 1891లో మనోన్మణియం సుందరనార్ రచించిన 'మనోన్మణియం' నాటకం నుంచి ఈ గీతాన్ని స్వీకరించారు. 1970 నుంచే ప్రభుత్వ కార్యక్రమాల్లో దీనిని ఆలపిస్తున్నప్పటికీ, 2021లో అధికారికంగా రాష్ట్ర గీతంగా గుర్తించారు. ఈ తీర్మానం అమలుకు ఎలాంటి బాహ్య అనుమతులు అవసరం లేదని స్పీకర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల్లో 'వందేమాతరం' గీతాన్ని మొదటగా ఆలపించాలని జూలై 9న కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సూచనలు జారీ చేసిన నేపథ్యంలో ఈ తీర్మానం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవంలో ఇతర గీతాల తర్వాత 'తమిళ తాయ్ వాళ్తు'ను పాడటం రాష్ట్రంలో రాజకీయ వివాదానికి దారితీసింది. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం భాషా, సాంస్కృతిక హక్కులను పునరుద్ఘాటిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది.

# దైవ నామాలను అపహాస్యం చేయొద్దు: పవన్ కల్యాణ్



దైవ నామాలను, భక్తి గీతాలను రాజకీయ ప్రయోజనాల కోసం పేరడీలుగా మార్చి అపహాస్యం చేయడాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్ర నామాలను కించపరచడం దారుణమని ఆయన పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఇలాంటి చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నెల్లూరు నగరంలో చోటుచేసుకున్న ఓ ఘటనను ఆయన ప్రస్తావించారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేని ఓ రాజకీయ పార్టీ, తమ కార్యక్రమాల్లో పవిత్రమైన గోవింద నామాలను పేరడీగా వాడుకోవడం భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందని అన్నారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న వారి తీరు ధార్మిక విశ్వాసాలకు విఘాతం కలిగించేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం అపహాస్యం చేయడమే కాదని, మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టే కుట్రపూరిత ఆలోచన అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ధార్మిక విశ్వాసాలతో ముడిపడిన అంశాలను చులకన చేసే ఇలాంటి చర్యలను సహించకూడదని స్పష్టం చేశారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ఎవరూ కూడా దైవ నామాలు, మంత్రాలు, స్తోత్రాలను అపహాస్యం చేసేందుకు వినియోగించవద్దని ఆయన హితవు పలికారు. భక్తికి సంబంధించిన పవిత్రమైన విషయాలను గౌరవించడం అందరి బాధ్యత అని ఆయన సూచించారు. ఈ మేరకు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.



## శ్రీ స్వామివారి సేవలో సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్

- జన్మదినం సందర్భంగా యాదగిరిగుట్టలో ప్రత్యేక పూజలు
- చేనేత శాలువాతో సత్కరించిన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం రఘునాథపురం గ్రామ సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు పొంది, తనతో పాటు గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ గోత్రనామాలతో అష్టోత్తర సువర్ణ పుష్పార్చన పూజలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు. సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్‌కు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను చేనేత శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం జన్మదిన వేడుకల సందర్భంగా రఘునాథపురం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సంతోష్ గౌడ్ మొక్కను నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు, గ్రామస్తులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## మరకత లింగ సోమేశ్వర స్వామి సేవలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

- కుటుంబ సమేతంగా దర్శనం.. ప్రత్యేక పూజలు నిర్వహణ



**తొలివెలుగు, చందిప్ప:** రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి ప్రాంతంలోని చందిప్ప గ్రామంలో కొలువై ఉన్న ప్రముఖ ప్రాచీన శైవ క్షేత్రం శ్రీ మరకత లింగ సోమేశ్వర స్వామివారిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రార్థించారు. ఆలయానికి చేరుకున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు ఆలయ అర్చకులు, సిబ్బంది సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలోని శ్రీ మరకత లింగ సోమేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలను నిర్వహించి, బీర్ల అయిలయ్య కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

**ఆలయ విశిష్టతపై ఆరా:**

ప్రాచీన శైవ సంప్రదాయానికి ప్రతీకగా నిలిచిన శ్రీ మరకత లింగ సోమేశ్వర స్వామి ఆలయ విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాధాన్యత గురించి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆలయ అర్చకులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ చరిత్రతో పాటు భక్తులకు అందుతున్న సౌకర్యాలు, ఆలయ అభివృద్ధికి చేపడుతున్న చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వేదమంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో బీర్ల అయిలయ్య కుటుంబ సభ్యులు, ఆలయ అర్చకులు, నిర్వాహకులు, స్థానిక ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అభ్యుదయ యూత్ కమిటీ అధ్యక్షుడిగా వెంకటేష్ గౌడ్

- ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక
- చౌటుప్పల్ రామ్ నగర్ కాలనీలో యూత్ కమిటీ సమావేశం

**తొలివెలుగు, చౌటుప్పల్ :** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు రామ్ నగర్ కాలనీలో అభ్యుదయ యూత్ కమిటీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీలో నిర్వహించిన యూత్ కమిటీ సభ్యుల సమావేశంలో ఈ ఎన్నిక చేపట్టారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా చెవ్వగొని వెంకటేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా తొర్పునూరి లింగస్వామి గౌడ్, ఉపాధ్యక్షుడిగా మార్గం నరసింహ యాదవ్‌లు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా తొర్పునూరి బాబు గౌడ్, గౌరవ సలహాదారులుగా చెరుకు అశోక్ గౌడ్, వర్కాల కుమార్ గౌడ్, తొర్పునూరి మహేష్ గౌడ్‌లను నియమించారు. నూతన కార్యవర్గాన్ని పలువురు నాయకులు, యూత్ సభ్యులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో బొల్లోజు విశ్వరూపాచారి, బాలగోని నరసింహ, తొర్పునూరి నరసింహ, తొర్పునూరి రవి, ఉష్కాగుల శ్రీశైలం, కళ్లెం నాగరాజ్, చెవ్వగొని మహేష్, చెరుకు లింగస్వామి, సందగళ్ల నాగరాజు, తొర్పునూరి సాయి, నవీన్ చారి, చెరుకు రాము, చెవ్వగొని రమేష్, చెరుకు సాయి, తొర్పునూరి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





## ఏఐ యుగంలో భారత్ నాస్కామ్ చైర్మన్ కీలక వ్యాఖ్యలు!

ఐటీ సంస్థల ఆదాయ వృద్ధి మెరుగుపడేలా చూడటం, అలాగే కంపెనీల్లో కృత్రిమ మేథ, సాంకేతికతల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రాధాన్యతనివ్వనున్నట్లు నాస్కామ్ కొత్త చైర్మన్‌గా నియమితులైన శ్రీకాంత్ వెలమకన్ని తెలిపారు. ఏఐ యుగంలో భారత్ మరింత మెరుగ్గా, దూకుడుగా పోటీపడేలా చూసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. టెక్నాలజీపై కంపెనీలు ప్రస్తుత స్థాయికి మించి వెచ్చించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. టెక్నాలజీ పురోగతి వల్ల మనుషుల కన్నా మెషిన్లు మెరుగ్గా పనులు పూర్తి చేయగలిగినా, మనుషులు పోషించాల్సిన పాత్ర ప్రాధాన్యత తగ్గిపోదని తెలిపారు. ఏఐ ఆధిపత్యం కనిపిస్తున్న తరుణంలో కూడా గత ఏడాది నికరంగా ఉద్యోగుల సంఖ్య పెరగడం సానుకూలాంశమని ఆయన పేర్కొన్నారు. ఏఐ పురోగతితో చిన్న, పెద్ద కంపెనీలు తమ వ్యాపారాలను సరికొత్తగా తీర్చిదిద్దుకునేందుకు అసాధారణ అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని శ్రీకాంత్ వివరించారు.

## ఒకేసారి రెండు బైకులు లాంచ్



క్లాసిక్ లెజెండ్స్ తాజాగా యెజ్డీ, బీఎస్ఏ బ్రాండ్స్ కింద స్క్రాంబ్లర్ మోటార్‌సైకిల్‌ని ప్రవేశపెట్టింది. వీటిలో యెజ్డీ స్క్రాంబ్లర్ 350 ప్రారంభ ధర రూ. 1,99,950గా ఉంటుంది. ఇది నాలుగు రంగుల్లో లభిస్తుంది. బీఎస్ఏ స్క్రాంబ్లర్ 650 ప్రారంభ ధర రూ. 3,24,950గా ఉంటుంది.కంపెనీ సహ వ్యవస్థాపకుడు అనుపమ్ తరేజా గురువారం వీటిని ఆవిష్కరించారు. బీఎస్ఏ స్క్రాంబ్లర్ దేశీయంగా ఈ సెగ్మెంట్లో ఏకైక 650 సీసీ సింగిల్ సిలిండర్ వాహనమని సంస్థ తెలిపింది. ఈ రెండు వాహనాలకు 4ఏళ్లు లేదా 50,000 కి.మీ. స్టాండర్డ్ వారంటీ, 6 ఏళ్ల వరకు ఎక్స్‌టెండెడ్ వారంటీ, 8 ఏళ్ల వరకు రోడ్‌సైడ్ అసిస్టెన్స్ మొదలైనవి ఉంటాయి.

## వోల్వో కీలక ప్రకటన: రూ.లక్ష వరకు పెరగనున్న ధరలు!



వోల్వో కార్ ఇండియా.. 2026 మే 1 నుంచి తమ కార్ల ధరలను లక్ష రూపాయల వరకు పెంచుతున్నట్లు ధృవీకరించింది. ఇటీవల పెరుగుతున్న ఖర్చుల కారణంగా ఆడి, మెర్సిడెస్-బెంజ్, బీఎండబ్ల్యూ వంటి ఇతర లగ్జరీ బ్రాండ్‌లు కూడా ధరలను సర్దుబాటు చేయవలసి వస్తున్న నేపథ్యంలో సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. వోల్వో భారత పోర్ట్‌ఫోలియోలో నాలుగు ప్రధాన మోడళ్లు ఉన్నాయి. అవి ఎక్స్‌సి30, ఎక్స్‌సి40, ఈఎక్స్60, ఈఎక్స్90. ప్రతి మోడల్‌కు సంబంధించిన నిర్దిష్ట ధరల పెంపులను కంపెనీ వెల్లడించనప్పటికీ, అన్ని వేరియంట్‌ల ధరలను గరిష్టంగా రూ.1 లక్షకు పరిమితం చేయనున్నట్లు సమాచారం.కొత్త ధరలు మే 1వ తేదీ నుంచి బుకింగ్‌లు, డెలివరీలకు వర్తిస్తాయి. అంటే అంతకు ముందు బుక్ చేసుకున్న లేదా కొనుగోలు చేసే కార్లకు పాత ధరలే వర్తిస్తాయి. కాగా వోల్వో కార్ ఇండియా దేశవ్యాప్తంగా 23 షోరూమ్‌లు మరియు 25 సర్వీస్ సెంటర్ల నెట్‌వర్క్‌ను నిర్వహిస్తోంది.

## భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

శుక్రవారం ఉదయం నష్టాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు, ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి నష్టాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 982.71 పాయింట్లు లేదా 1.27 శాతం నష్టంతో 76,681.29 వద్ద.. నిఫ్టీ 275.10 పాయింట్లు లేదా 1.14 శాతం నష్టంతో 23,897.95 వద్ద నిలిచాయి. ఇమామి రియల్టీ లిమిటెడ్, ఖైతాన్ (ఇండియా) లిమిటెడ్, కంది కర్పూరం లిమిటెడ్, శేఖావతి ఇండస్ట్రీస్ లిమిటెడ్ , మాస్క్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరాయి. అన్నాన్ హెల్త్‌కేర్ లిమిటెడ్, ఏబీ కాటన్సిన్ ఇండియా లిమిటెడ్, యూనీటా అసెట్ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ లిమిటెడ్, ఖైతాన్ కెమికల్స్ & ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ వంటివి నష్టాల జాబితాలో చేరాయి.

# ఇందుకేనా బంగారం ధరలు తగ్గుతున్నది..?



గత వారం రోజులుగా పసిడి ప్రియులకు ఊరటనిస్తూ బంగారం ధరలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. అంతర్జాతీయ పరిణామాలతో పాటు దేశీయ మార్కెట్లో మారుతున్న సమీకరణాలు పసిడి ధరను కిందకు దింపుతున్నాయి. గత వారం రోజులుగా దేశీయ మార్కెట్లో తులం బంగారం ధర గణనీయంగా తగ్గుతూ వస్తోంది. అక్షయ తృతీయ వంటి పర్వదినాల వేళ కూడా డిమాండ్ ఊహించిన స్థాయిలో లేకపోవడం, అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ బలోపేతం కావడం వంటి అంశాలు పసిడి వెలుగులను తగ్గించాయి. దేశంలో ముఖ్యంగా హైదరాబాద్ సహా తెలుగు రాష్ట్రాల్లో ఏప్రిల్ 19 నుంచి ఏప్రిల్ 24 మధ్య కాలంలో బంగారం ధరలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ఏప్రిల్ 19వ తేదీన 22 క్యారెట్ల బంగారం తులం (10 గ్రాములు) ధర రూ. 1,42,800 గా ఉండగా, ఏప్రిల్ 24 నాటికి అది రూ. 1,40,200 కి చేరి, మొత్తం రూ. 2,600 మేర తగ్గింది. అదేవిధంగా, 24 క్యారెట్ల బంగారం విషయానికి వస్తే, ఏప్రిల్ 19న రూ. 1,55,780 గా ఉన్న ధర, ఏప్రిల్ 24 నాటికి రూ. 1,52,950కి పడిపోయింది, అంటే తులంపై సుమారు రూ. 2,830 మేర ధర తగ్గింది. గత ఐదు రోజులుగా వరుసగా ధరలు క్షీణించడంతో కొనుగోలుదారులకు భారీ ఉపశమనం లభించింది.

**ధరలు తగ్గడానికి దారితీసిన 4 కీలక అంశాలు**

అంతర్జాతీయ మార్కెట్లో అమెరికన్ డాలర్ విలువ పెరగడం బంగారం ధరపై నేరుగా ప్రభావం చూపుతోంది. డాలర్ ఇండెక్స్ బలపడినప్పుడల్లా పెట్టుబడిదారులు పసిడి కంటే డాలర్ వైపు మొగ్గు చూపుతారు. దీనివల్ల అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గి ధరలు అదుపులోకి వస్తున్నాయి.

**ముడిచమురు సెగ.. వడ్డీ రేట్ల భయం**

ప్రస్తుతం అంతర్జాతీయంగా (ముఖ్యంగా హార్ముజ్ జలసంధి వద్ద) నెలకొన్న ఉద్రిక్తతల వల్ల ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కును దాటాయి. చమురు ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం పెరుగుతుంది. దీన్ని అరికట్టడానికి అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఇప్పుడప్పుడే తగ్గించకపోవచ్చనే సంకేతాలు వెలువడటంతో, బంగారంపై పెట్టుబడులు తగ్గాయి.

**లాభాల స్వీకరణ**

ఈ ఏడాది ప్రారంభంలో బంగారం ధరలు రికార్డు స్థాయిలకు (తులం దాదాపు రూ.1,50,000 పైచిలుకు) చేరాయి. ధరలు గరిష్ట స్థాయికి చేరినప్పుడు పెద్ద ఇన్వెస్టర్లు తమ వద్ద ఉన్న బంగారాన్ని అమ్మి లాభాలను గడించడం (ప్రాఫిట్ బుకింగ్) మొదలుపెట్టారు. మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి పెరగడం కూడా ధరల తగ్గుదలకు ఒక కారణం.

### దేశీయ మార్కెట్లో తగ్గిన డిమాండ్

భారత్‌లో బంగారం ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు కొనుగోళ్లకు దూరంగా ఉంటున్నారు. పెళ్లిళ్ల సీజన్ ఉన్నప్పటికీ, పాత బంగారాన్ని ఇచ్చి కొత్తది తీసుకోవడం లేదా తక్కువ పరిమాణంలో కొనుగోలు చేయడం వల్ల రిటైల్ మార్కెట్లో సందడి తగ్గింది. ప్రస్తుతం మార్కెట్ ఒడిదుడుకులకు లోనవుతోంది. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు ఒక కొలిక్కి వచ్చి, డాలర్ విలువ స్థిరపడితే తప్ప ధరల్లో స్పష్టత రాదు. అయితే, ధరలు తగ్గుతున్న ఈ సమయం దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు మంచి అవకాశమని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముందుముందు ధరలు మరింత తగ్గుతాయా లేదా మళ్లీ పుంజుకుంటాయా అన్నది అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. పసిడి ప్రేమికులు మాత్రం ఈ ధరల తగ్గింపును ఆస్వాదిస్తూ కొనుగోళ్లకు సిద్ధమవుతున్నారు.

# 100 బిలియన్ డాలర్ల క్లబ్బులో మళ్లీ చేరిన గౌతమ్ అదానీ..


### బిల్‌గేట్స్, ముకేష్ అంబానీల కంటే రిచ్



ప్రముఖ వ్యాపారవేత్త, అదానీ సంస్థల అధినేత గౌతమ్ అదానీ మళ్లీ 100 బిలియన్ డాలర్ల క్లబ్బులో చేరారు. ఒక పక్క మార్కెట్లో అస్థిర పరిస్థితులు నెలకొన్నప్పటికీ.. అదానీ సంపద మాత్రం పెరుగుతుండటం విశేషం. ప్రపంచ సంపన్నుల జాబితాలో నిత్యం ఉండే అదానీ.. ఇప్పుడు వారిలో 100 బిలియన్ డాలర్ల క్లబ్బులో చేరారు. బ్లూమ్‌బర్గ్ సంస్థ విడుదల చేసిన బిలియనీర్స్ ఇండెక్స్‌లో గౌతమ్ అదానీ 106 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచంలోనే 17వ స్థానంలో కొనసాగుతున్నారు. ఒక్క రోజులోనే ఆయన సంపద 7.16 బిలియన్లు పెరిగినట్లు బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ సంస్థ నివేదిక తెలిపింది. ఈ ఒక్క ఏడాదిలోనే గౌతమ్ అదానీ సంపద భారీగా పెరిగింది. 2026లో ఇప్పటివరకు ఆయన సంపద 21.4 బిలియన్ డాలర్లు పెరిగింది. ఈ నివేదికతో అదానీ.. ఇప్పుడు బిల్‌గేట్స్‌ను కూడా దాటేశాడు. బిల్‌గేట్స్ సంపద 104 బిలియన్ డాలర్లుగా ఉంది. భారతీయ సంపన్నుడు ముకేష్ అంబానీ కూడా అదానీ వెనుకే ఉన్నాడు. అంబానీ 90.2 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచ సంపన్నుల్లో 20వ స్థానంలో ఉన్నారు. అదానీతో పోలిస్తే మూడు స్థానాలు వెనుకబడి పోయాడు. ఎప్పట్లాగే ప్రపంచ కుబేరుల్లో ఎక్స్, టెస్లా, స్పేస్ ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్ మొదటి స్థానంలో ఉన్నారు. అమెరికాకు చెందిన ఆయన సంపద 645 బిలియన్ డాలర్లుగా ఉంది. ఆ తర్వాత 289 బిలియన్ డాలర్లతో ల్యారీ పేజ్ రెండో స్థానంలో, 274 బిలియన్ డాలర్లతో జెఫ్ బెజోస్ మూడో స్థానంలో ఉన్నారు. ఇక.. ప్రస్తుతం స్టాక్ మార్కెట్లో తీవ్ర ఒడుదొడుకులు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇరాన్ యుద్ధం, చమురు ధరలు వంటి కారణాలతో స్టాక్ మార్కెట్లు అనిశ్చితిలో ఉన్నప్పటికీ.. ఇన్వెస్టర్ల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గౌతమ్ అదానీ తన సంపదను పెంచుకుంటున్నాడని విశ్లేషకులు అంటున్నారు.


## ఆన్‌లైన్ గేమింగ్‌కు కొత్త రూల్స్..

న్యూఢిల్లీ: నానాటికీ విస్తరిస్తున్న దేశీయ ఆన్‌లైన్ గేమింగ్ రంగం.. కొత్త రెగ్యులేటరీ కిందికి వెళ్లబోతున్నది. ఎప్పట్నుంచో వేచిచూస్తున్న ఆన్‌లైన్ గేమింగ్ నిబంధనలను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఎట్టకేలకు బుధవారం ప్రకటించింది. వచ్చే నెల మే నుంచి ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్ రూల్స్ అమల్లోకి వస్తాయని ఐటీ శాఖ కార్యదర్శి ఎస్ కృష్ణన్ విలేకరులకు తెలిపారు. దీంతో గేమింగ్ ఎకోసిస్టమ్‌లో పారదర్శకత, జవాబుదారీతనం, యూజర్ల భద్రత వంటివి పెరుగుతాయన్న ఆశాభావం వ్యక్తమవుతున్నది. ఆన్‌లైన్ గేమింగ్ సంస్థల కార్యకలాపాలు, డాటా, కంటెంట్‌పైనా నియంత్రణ ఉంటుందని ఇండస్ట్రీ విశ్లేషకులు అంటున్నారు ఈ క్రమంలోనే కొన్ని ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలై, మోసాల బారినపడి ఎందరో అమాయకులు చనిపోతున్న దృష్ట్యా రూల్స్ కఠినంగానే ఉండాల్సిన అవసరం ఉందని కూడా వారు అభిప్రాయపడుతుండటం గమనార్హం. ఇదిలావుంటే రియల్ మనీ గేమ్స్‌కాని చాలా ఆన్‌లైన్ గేమ్స్‌కు రిజిస్ట్రేషన్ తప్పనిసరి కాదన్నారు కృష్ణన్. అయితే ఈస్పోర్ట్స్‌కు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. మొత్తానికి తాజాగా విడుదలైన ఈ నిబంధనల నేపథ్యంలో భారతీయ ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ రానున్నది. ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి దీనికి చైర్‌పర్సన్‌గా ఉంటారు. ఇందులో ఎక్స్ అఫీషియో సభ్యులుగా కేంద్ర హోం, ఆర్థిక, క్రీడ, న్యాయ తదితర కీలక మంత్రిత్వ శాఖల జాయింట్ సెక్రటరీలు వ్యవహరిస్తారు.



# ఒకే నెలలో 46 వేల ఉద్యోగాలు కట్..

### సిద్ధమవుతున్న మెటా, ఒరాకిల్, మైక్రోసాఫ్ట్




ఐటీ అనుబంధ సంస్థల్లో భారీ స్థాయిలో లేఆఫ్స్ కొనసాగుతున్నాయి. ఏఐ కారణంగా ఆయా సంస్థల్లో వేలాది మంది ఉద్యోగులలోంచి తొలగిస్తున్నారు. త్వరలో టాప్ కంపెనీల్లో కూడా భారీగా కోతలు ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మెటా, ఒరాకిల్, మైక్రోసాఫ్ట్ సంస్థలు కలిసి వచ్చే జూన్‌లో భారీగా ఉద్యోగుల్ని తొలగించబోతుంది. ఈ మూడు సంస్థలు కలిసి జూన్‌లో ఏకంగా 46,750 మంది సిబ్బందిని తొలగించబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత మార్చిలో కూడా అనేక సంస్థలు ఉద్యోగుల్ని తొలగించాయి. ఏఐ టెక్నాలజీ మీద పెట్టుబడులకు సిద్ధమవ్వడం, కంపెనీలో నిర్మాణాత్మక మార్పుల కారణంగా ఉద్యోగుల్ని తొలగిస్తున్నట్లు కంపెనీలు చెబుతున్నాయి. ఒకవైపు తమ కంపెనీలు వృద్ధి బాటలోనే నడుస్తున్నాయని చెబుతూనే, భవిష్యత్తు బాగుంటుందని చెబుతూనే ఉద్యోగుల్ని తొలగిస్తుండటం విశేషం. మెటా, ఒరాకిల్, మైక్రోసాఫ్ట్ సంస్థలు కూడా ఇప్పుడు ఇంకో 46,750 మందిని తొలగించబోతుండటం ఆసక్తికరంగా మారింది. మెటా సంస్థ తన కంపెనీలో పని చేస్తున్న వారిలో పది శాతం మంది ఉద్యోగుల్ని.. అంటే కనీసం 8,000 మందిని తొలగించాలని నిర్ణయించింది. అలాగే, కొత్తగా కొంతమందిని ఉద్యోగాల్లోకి తీసుకోవాలి అని ఇంతకుముందు తీసుకున్న నిర్ణయాన్ని వాయిదా వేసింది. ఇదే సమయంలో ఏఐ టెక్నాలజీపై మెటా భారీగా పెట్టుబడులు పెడుతోంది. ఈ ఏడాది 135 బిలియన్ డాలర్లను ఇన్వెస్ట్ చేయాలని కంపెనీ నిర్ణయించింది. అంటే, గత మూడేళ్లలో కంపెనీ ఏఐ మీద పెట్టుబడి పెట్టిన దానితో సమానం. ఏఐ టెక్నాలజీ సిబ్బంది అవసరాన్ని తగ్గిస్తుందని గతంలోనే మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ ప్రకటించారు. ఒరాకిల్ సంస్థ కూడా 30,000 మందిని తొలగించబోతుంది. ఇప్పటికే కొందరికి దీనికి సంబంధించిన మెయిల్స్ వచ్చినట్లు ఉద్యోగులు చెబుతున్నారు. మెయిల్ వచ్చినప్పటి నుంచే ఉద్యోగంలోంచి తొలగిస్తారు. మరోవైపు మైక్రోసాఫ్ట్ సంస్థ 8,750 మంది సిబ్బందిని తొలగించాలని నిర్ణయించింది. అంటే సంస్థలో 7 శాతం సిబ్బందిని తొలగించబోతోంది. అయితే, సిబ్బందికి వాలంటరీ రిటైర్‌మెంట్ అవకాశం కల్పిస్తోంది. మైక్రోసాఫ్ట్ స్థాపించిన 51 ఏళ్లలో ఇలాంటి ప్రతిపాదన తీసుకురావడం ఇదే మొదటిసారి.



# ఫుడ్ బిజినెస్‌లోకి అడుగుపెట్టిన శ్రీముఖి..

## హైదరాబాద్‌లో కొత్త రెస్టారెంట్ ప్రారంభం

టాలీవుడ్ ప్రముఖ యాంకర్, నటి శ్రీముఖి ఫుడ్ బిజినెస్‌లోకి అడుగుపెట్టింది. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఉన్న క్యాపిటల్ పార్క్‌లో తన స్నేహితులు శ్రావణ్, ఆనంద్, రవిలతో కలిసి 'ఫుర్సత్ అనే రెస్టారెంట్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా శ్రీముఖి మాట్లాడుతూ.. తనకు భోజనం అంటే చాలా ఇష్టమని, ముఖ్యంగా బిర్యానీ, చికెన్ కర్రీలతో పాటు వెజిటేరియన్ వంటకాలను కూడా ఆస్వాదిస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చి ప్రశాంతంగా గడిపేలా, ఒక మంచి అనుభూతిని అందించేలా ఫుర్సత్‌ను తీర్చిదిద్దినట్లు ఆమె వివరించారు. ఈ రెస్టారెంట్‌లో సుమారు 300 మంది కూర్చునే సదుపాయంతో పాటు ప్రత్యేకమైన బ్యాంక్వెట్ హాల్స్ కూడా ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. నల్లి గోష్ట్ బిర్యానీ వంటి ప్రత్యేక వంటకాలు ఇక్కడ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని, సరసమైన ధరలకే నాణ్యమైన ఆహారాన్ని అందించడమే తమ లక్ష్యమని శ్రీముఖి పేర్కొన్నారు. భాగస్వాములు శ్రావణ్, ఆనంద్, రవి మాట్లాడుతూ.. రుచి, సేవలలో ఎక్కడా రాజీ పడకుండా సంప్రదాయ, ఆధునిక వంటకాల కలయికతో మెనూని రూపొందించామని చెప్పారు. కార్పొరేట్ సమావేశాలకు, కుటుంబ వేడుకలకు ఫుర్సత్ ఒక ఉత్తమ గమ్యస్థానంగా మారుతుందని వారు ధీమా వ్యక్తం చేశారు. వినూత్నమైన డైనింగ్ కాన్సెప్ట్‌తో ప్రారంభమైన ఈ రెస్టారెంట్, శ్రీముఖి భాగస్వామ్యంతో హైదరాబాద్ ఆహార ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



# ముందు అనుకున్నారు.. ఫైనల్‌గా ఫిక్స్ చేశారా?

రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న సినిమా 'పెద్ది'.. మరో నెల రోజుల్లో థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే షూటింగ్ నడుస్తుండటంతో వాయిదా పడే అవకాశాలు ఉన్నాయని రూమర్స్ వస్తున్నాయి. మరోవైపు చరణ్ పుట్టినరోజున ఓవర్సీస్ బుకింగ్స్ ఓపెన్ అవుతాయని అధికారికంగా ప్రకటించడంతో వాయిదా లాంటిది లేదని పరోక్షంగా క్లారిటీ ఇచ్చినట్లయింది. అయితే ఈ మూవీలోని ఐటమ్ సాంగ్ ఎవరు చేస్తారా అనే ప్రశ్న కూడా ఇంకా అలానే మిగిలిపోయింది. ఫైనల్‌గా దానికి సమాధానం దొరికేసినట్లు కనిపిస్తోంది. గతంలో 'పెద్ది' ఐటమ్ కోసం పూజా హెగ్డే, ఆయేషా ఖాన్, మృణాల్ ఠాకుర్.. ఇలా చాలా పేర్లు వినిపించాయి. కానీ పాట షూటింగ్ ఇంకా బ్యాలెన్స్ ఉండేసరికి ఎవరిని తీసుకున్నారనే విషయం బయటకు రాలేదు. చివరకు ఇప్పుడు ముందు అనుకున్న వాళ్లలో మృణాల్ ఠాకుర్‌ని ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. వచ్చే నెలలో ఈమె హీరోయిన్‌గా చేసిన 'డకాయిట్' రిలీజ్ కానుంది. దీని ప్రమోషన్స్‌లో పాల్గొనేందుకు ప్లస్ 'పెద్ది' సాంగ్ చేసేందుకుగానూ రాబోయే కొన్నిరోజులు ఈమె హైదరాబాద్‌లోనే ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ ఐటమ్ పాటలో చరణ్–మృణాల్‌తో పాటు జాన్వీ కపూర్ కూడా కాసేపు కనిపిస్తుందని అంటున్నారు. బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ విలేజ్ డ్రామాగా తెరకెక్కించారు. కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్, జగపతిబాబు తదితరులు కీలక పాత్రలు చేశారు. ఏఆర్ రెహమాన్ సంగీతమందించాడు. ఇప్పటికే రెండు పాటలు రిలీజ్ కాగా రెండూ సూపర్ హిట్ అయ్యాయి.



# ధనుష్‌కి జోడీగా రుక్మిణి..

తక్కువ టైంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్. సొంత భాషలో హిట్స్ ఉన్నప్పటికీ తెలుగు, తమిళంలో చేసిన చిత్రాలన్నీ డిజాస్టర్స్ అయ్యాయి. ప్రస్తుతం ఎన్టీఆర్–ప్రశాంత్ నీల్ కాంబోలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా మూవీలో హీరోయిన్‌గా చేస్తోంది. అయితే తమిళంలో చేసిన మూవీస్ ఫ్లాప్ అయినప్పటికీ.. ఇప్పుడు రుక్మిణి మరో అవకాశం దక్కించుకున్నట్లు తెలుస్తోంది. వరుస సినిమాలతో అలరిస్తున్న తమిళ హీరో ధనుష్.. ప్రస్తుతం విఘ్నేశ్ రాజా దర్శకత్వంలో 'కర' మూవీ చేశాడు. మమిత బైజు హీరోయిన్. వచ్చే నెల 30న థియేటర్లలోకి రానుంది. మరోవైపు 'అమరన్' తీసిన రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలోనూ ధనుష్ ఓ సినిమా చేస్తున్నాడు. డీ55 పేరుతో రూపొందుతున్న ఈ చిత్రంలో సాయిపల్లవి, శ్రీలీల హీరోయిన్స్. సాయి అభయంకర్ సంగీతాన్ని అందిస్తున్నాడు. దీని తర్వాత ధనుష్ మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'లబ్బర్ పందు' ఫేమ్ తమిళసన్ పచ్చముత్తు దర్శకత్వం వహించనున్నట్లు టాక్. ఇందులోనే దక్షిణాది క్రేజీ హీరోయిన్ రుక్మిణి వసంత్.. ధనుష్ సరసన నటించనుందట. ఇదే నిజమైతే వీళ్లిద్దరి కాంబోలో రూపొందే తొలి చిత్రం ఇదే అవుతుంది. ఈ ?ప్రాజెక్టుకి అనిరుధ్ సంగీంతమందించనున్నాడట. ఇందులో ప్రతినాయకుడిగా విజయ్ కుమార్ నటిస్తారని సమాచారం. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.

# విజయ్ సేతుపతికి జోడీగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్!



చేతినిండా సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడు నటుడు విజయ్ సేతుపతి. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో ఎడాపెడా చిత్రాలు చేస్తున్నాడు. తెలుగులో పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ మూవీ చేస్తున్నాడు. ప్రస్తుతం వెట్రిమారన్ డైరెక్షన్‌లో శింబు హీరోగా నటిస్తున్న అరసన్ చిత్రంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాడు. అలాగే మరికొన్ని సినిమాల్లోనూ యాక్ట్ చేస్తున్న ఈయన తాజాగా మరో కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. బాలీవుడ్ బ్యూటీ విడాముయుర్చి ఫేమ్ మగిళ్ తిరుమేణి దర్శకత్వంలో సినిమా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ ప్రతినాయకుడిగా నటించనున్నట్లు భోగట్టా! ఇకపోతే ఇందులో విజయ్ సేతుపతికి జంటగా బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్‌ను నటింపజేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ ఆఫర్‌కుగానీ ఆమె ఒప్పుకుంటే కోలీవుడ్‌లో మరో క్రేజీ కాంబో షురూ అయినట్లే! మరి ఇదెంతవరకు నిజమన్నది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చేవరకు ఆగాల్సిందే!

# 'స్పిరిట్' భామని రంగంలోకి దించుతున్న నాని?



టాలీవుడ్‌లో మినిమం గ్యారంటీ హీరోగా పేరు తెచ్చుకున్న నాని.. ప్రస్తుతం 'ప్యారడైజ్'తో బిజీగా ఉన్నాడు. మరోవైపు 'ఓజీ' సుజీత్ దర్శకత్వంలో త్వరలో ఓ మూవీని ప్రారంభించబోతున్నాడు. ఇవి కాకుండా మరికొన్ని లైన్‌లో ఉన్నాయి. ఇలా కెరీర్ పరంగా మంచి ఫామ్‌లో ఉన్న నాని.. ఇప్పుడు ఓ బోల్ బ్యూటీతో స్క్రీన్ షేర్ చేసుకునేందుకు సిద్ధమయ్యాడట. పలు హిందీ చిత్రాల్లో నటించిన తృప్తి దిమ్రికి.. సందీప్ రెడ్డి వంగా తీసిన 'యానిమల్' మూవీ ఓవర్‌నైట్ స్టార్‌డమ్ తెచ్చిపెట్టింది. బాలీవుడ్‌లో వరస అవకాశాలు అందుకుంటూ బిజీ అయిపోయింది. ప్రస్తుతం తనకు లైఫ్ ఇచ్చిన సందీప్ వంగా తీస్తున్న 'స్పిరిట్'లో ప్రభాస్‌కి జోడీగా చేస్తోంది. మరి మెయిన్ లీడ్ లేదా సెకండ్ హీరోయిన్ అనేది తెలియాల్సి ఉంది. ఇదలా ఉండగానే ఇప్పుడు నాని చేయబోయే ఓ మూవీ కోసం తృప్తిని హీరోయిన్‌గా అనుకుంటున్నారట. ఒకవేళ ఇదే నిజమైతే తృప్తి.. టాలీవుడ్ ఎంట్రీ చిత్రం ఇదే కావొచ్చు. గత కొన్ని సినిమాలతో పాన్ ఇండియా మార్కెట్‌పై దృష్టి పెట్టిన నాని.. అందుకు తగ్గట్లే బాలీవుడ్‌లో మెల్లమెల్లగా గుర్తింపు తెచ్చుకునే పనిలో ఉన్నాడు. ప్రస్తుతం చేస్తున్న 'ప్యారడైజ్'లోనూ ఓ కీలక పాత్ర కోసం రాఘవ్ జ్యూయెల్ అనే నటుడితో కలిసి పనిచేస్తున్నాడు. ఇప్పుడు తృప్తి పేరు వినిపిస్తుంది. చూడాలి మరి ఇందులో ఎంత నిజముందో?


Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com